
# నవలిక



◆ ప్రయోగం — ఓల్గా

◆ పురుషుడి బలం సమాజం ఇచ్చిన బలమేనని నిరూపించిన మహిళ కథ

## నవలిక




# ప్రేమాగర

● ఓల్గా

● చిత్రాలు: చంద్ర

నరేంద్రకి ఎటూ పాలుబోవడం లేదు. ఏ నిర్ణయం తీసుకుంటే ఏ చిక్కొచ్చి పడుతుందో, భవిష్యత్ జీవితం ఎలా అంధకార బంధురం అవుతుందోననే సందేహంతో సతమతమవుతున్నాడు. ఒక మగవాడు పెళ్ళి గురించి ఇంత భయపడతాడంటే, నిర్ణయం తీసుకోవటానికి ఇంత కంగారుపడతాడంటే ఎవరూ నమ్మరేమోగాని, నరేంద్ర విషయంలో అది నిజమే.

నరేంద్ర మామూలుగా మంచివాడు. బుద్ధిగా చదువుకున్నాడు. చదువుతోపాటు సంగీత సాహిత్యాల్లో ఆసక్తి పెంచుకున్నాడు. స్నేహపాత్రుడు. సమాజం ఏ విషయాల్లో మంచివైపు నడుస్తోందో, ఏ విషయాల్లో చెడిపోతోందో తెలుసుకోగల వివేకవంతుడు. స్వార్థ వరుడు కాదుగానీ, తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం అని గ్రహించగలిగినంత లౌక్యుడు. చదువు పూర్తవగానే ఉద్యోగం సంపాదించుకున్న సమర్థుడు. ఇట్లాంటి గుణాభిరాముడైన నరేంద్రకి పెళ్ళి విషయం ఒకటి కొరుకుడు పడకుండా ఉంది. ప్రేమ గురించి కూడా అతను తగుమాత్రం కలలు కన్నాడు. ప్రేమ వివాహం చేసుకోవాలని కూడా అనుకున్నాడు. తీరా తనకు సునంద అనే అమ్మాయి పరిచయమై, ఆ అమ్మాయిని తను ప్రేమిస్తున్నా అనే అనుమానం వచ్చేసరికి భయపడ్డాడు.

సునంద నరేంద్ర కొలీగ్. నరేంద్రతో పాటే ఉద్యోగంలో చేరింది. చాలా చురుకైన మనిషి. ఆఫీసులో ఎంత పనైనా చకచకా చేసుకుపోతుంది. తనూ, తన టేబిల్, తన పనీ అంతా చురుకుదనంతో, పరిశుభ్రతతో, నైపుణ్యంతో విలసిల్లుతూ ఉంటుంది. ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది. ఒక్కొక్కసారి తప్ప. ఆ ఒక్క సారీ ఎప్పుడంటే...

మగవాళ్ళ అహంకారం గురించీ, అభిజాత్య గురించీ మాట్లాడేటప్పుడు మండిపడుతుంది మగవాళ్ళనీ, వాళ్ళ హీనత్వాన్నీ వెకిలితనాన్నీ రాక్షసత్వాన్నీ కడిగి పారేస్తుంది. అప్పుడామె ముఖ ఎర్రబడిపోతుంది. కళ్ళు కోపంతో జ్వలిస్తుంటాయి పెదవులు అదురుతుంటాయి. ముక్కు మీద చిన్న చిన్న చెమట చుక్కలు పొటమరించి నరేంద్ర వాటిని తన చేత్తో తుడిచివేయాలనే కోరిక కలిగిస్తుంటాయి.

ఒక్కోసారి ఆమె చాలా దిగులుగా ఉంటుంది పేపర్లో ఆడవాళ్ళ మీద జరిగిన అత్యాచార గురించి చదివినప్పుడూ, ఎవరైనా స్త్రీల కష్టా గురించి ప్రస్తావన తెచ్చినప్పుడూ సునంద కళ్ళనీ పర్యంతమవుతుంది. ఆ రెండు సందర్భాల్లో త సునంద ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుంది.

ఆఫీసులో తన పట్ల ఎవరు కొంచెం అ ఇటుగా ప్రవర్తించినా సహించని సునంద అ గౌరవానికి నరేంద్ర అబ్బురపడుతుంటాడు.

ఆడపిల్ల కదా అని ఏ సౌకర్యం కలగజే బోయినా సహించదు.

నేను అన్నింటిలో మీతో సమానం అన్నట్లు ప్రవర్తి సునంధ అంటే ఆఫీసులో చాలామందికి భయం. అ అభిమానం వాళ్ళకు అహంకారంలా కనపడుతుంది

నరేంద్ర ఆమె అభిమానాన్ని కూడా మె కుంటాడు. ఆమె తనపై పెత్తనం చేయబోయేవా ఆటల్ని ఎలా సాగనివ్వదో, అంత పట్టుదలగానూ కిందివాళ్ళ మీద తను పెత్తనం చెయ్యకుండా ఉంటు

ఆఫీసర్‌తో ఎంత నిక్కచ్చిగా మాట్లాడుతు ఆఫీస్ బాయ్‌తో అంత స్నేహంగా మాట్లాడుతుం

ఏ విషయంలోనూ ఎవరికీ అర్థం కాని సున చాలా విషయాల్లో నరేంద్రకు అర్థమయింది.

ఐనా సరే - సునందని పెళ్ళాడితే, తన జీ గురించి నరేంద్రకి భయంగానే ఉంది.

ఆమె మగవాళ్ళను తిడుతుంటే తనకి పెద్ద బాధ లేదు. ఎందుకంటే ఆమె తిట్టే మగ జాబితాలోకి తనెప్పుడూ రాడు. కానీ, సునం

పెళ్ళాడాక తనలో మగవాడి ఏ లక్షణమన్నా ఆమె దృష్టికి వస్తే ఆమె తననెలా చూస్తుంది.

ఆ చూపుల్ని తను భరించగలడా?

భార్యను సమానంగా చూడటం తనకు చేతనవుతుందా? తన రక్తంలో నిద్రాణమై ఉన్న పురుషాహంకారం ఎప్పుడన్నా పడగ విప్పకుండా ఉంటుందా?

అప్పుడు సునంద అనవలసిన నాలుగు మాటలూ అని తన మానాన తను వెళ్ళిపోతే?

తనెప్పుడన్నా వినుక్కోవచ్చు, కోపం రావచ్చు. ఈ అభిమానవతి భరించగలదా?

తనింతవరకూ అమ్మ సేవల మీదా, చెల్లెళ్ళ సేవల మీదా ఆధారపడి బతుకుతున్నాడు.

అమ్మ వేళకు టిఫినూ, భోజనం పెడుతుంది. తిని ఆఫీసుకు రావటం తప్ప ఆ తిండి ఎలా తయారుచెయ్యటమో తెలియదు.

చెల్లెళ్ళు బట్టలుతికించి ఇస్త్రీ చేయిస్తారు.

ఇంట్లో పనులు తనకేం తెలియదు. బజారు నుంచి కూరలూ, సరకులూ తేగలడు.

రేపు సునంద బజారు పనులు నే చూస్తాలే, వంట సంగతి చూడమంటే?

సునందకు వంటొచ్చో రాదో తెలియదు.

తనతో ప్రపంచ రాజకీయాలూ, స్త్రీ వాద సాహిత్యం, ఎగ్జిస్టెన్షియలిజం లోని లోతుపాతులూ, అమ్జాద్ అలీ ఖాన్ సరోద్ లోని స్వర మాధుర్యం, బాబ్రీ మసీదు విధ్వంసం వెనక ఉన్న హిందూ ఫాసిజం, వీటి గురించి అనర్గళంగా మాట్లాడే అమ్మాయితో "మీకు వంట చెయ్యటం వచ్చా? ఏ కూరలు బాగా వండుతారు? నా కిష్టమైన కాకరకాయ వేపుడు మా అమ్మలా బెల్లం వెయ్యకుండా కూడా అద్భుతంగా చేదు లేకుండా వండుతారా? అరిసెల పాకానికీ, బూరెల పాకానికీ తేడా తెలుసా? కారప్పూస ఒత్తగలరా?" అని ఎలా అడుగుతాడు?

సునంద నోటి నుంచి వంటల గురించిన ప్రస్తావనే రాదు. పెళ్ళి చేసుకుని తిండి సుఖం కూడా లేకుండా తను వంటింట్లో మగ్గటం ఎందుకు?

ఎప్పుడే తప్పు చేస్తానో అని అసిధారావ్రతం చేస్తూ ఉండటం ఎందుకు?

సునందని స్నేహితురాలిగా మిగుల్చుకుని, ఒక మామూలు అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే సరిపోదా?

మామూలు అమ్మాయి —

తనతో సమానం అంటూ ధీమా చూపకుండా - మీరే నా దైవం అంటూ భయభక్తులతో మెలగే అమ్మాయి - తన పక్కన కాకుండా వెనుక నిలబడే అమ్మాయి - తను లేచేసరికి కాఫీకప్పుతో ఎదురొచ్చే అమ్మాయి - తన కిష్టమైన వంటకాలన్నీ వండి కొసరి కొసరి తృప్తిగా తినిపించే అమ్మాయి.

ఎవరి పని వారిదన్నట్లు కాకుండా తన కోసం అందంగా అలంకరించుకుని ఎదురుచూసే అమ్మాయి.

తన చేతుల్లో సిగ్గుల మొగ్గయ్యే అమ్మాయి.

సునంద సిగ్గు పడుతుందా?

తను దగ్గరకు తీసుకుంటే ఏం చేస్తుంది, సిగ్గుపడకుండా?

"మీరెక్కవలసిన బస్సులు పది నిమిషాల్లో మూడు వెళ్ళిపోయాయి. ఏంటా ఆలోచన? నాక్కూడా చెప్పకూడదు?" సునంద వెక్కిరింతగా నవ్వింది.

నరేంద్ర సిగ్గుపడిపోయాడు.

అదే సమయంలో, సునంద చచ్చినా సిగ్గుపడదు, తనే సిగ్గుపడతాడేమో అనే ఆలోచనతో ఆందోళన మొదలయింది.

సిగ్గూ, ఆ వెనుక ఆందోళన, రంగులు మారుతున్న నరేంద్ర ముఖం లోకి చిత్రంగా చూసింది సునంద.

అంతలో ఆమె ఎక్కవలసిన బస్ వచ్చింది.

"సీ యూ" అంటూ చకచకా వెళ్ళి బస్సెక్కింది.

నరేంద్ర నిట్టూర్చి తన బస్ కోసం ఎదురు చూడటం మొదలు పెట్టాడు.

* * *

నరేంద్ర ఇంటికి చేరేసరికి తల్లి శాంతమ్మ హడావిడిగా ఎదురొచ్చింది.

"శంకరం మామయ్యా, వాళ్ళమ్మాయీ వచ్చార్రా" అని సంబరంగా చెప్పేసింది.

నరేంద్రకు ఒక్క క్షణం చికాకనిపించింది.

శంకరం గారూ, నరేంద్ర తండ్రి మాధవరావూ స్నేహితులు. నరేంద్ర చిన్న తనంలో ఇద్దరూ పక్క పక్క ఇళ్ళల్లో ఆరేళ్ళు చాలా స్నేహంగా బతికారు. తర్వాత ఉద్యోగాలలో మార్పులు, ట్రాన్స్‌ఫర్లు వీటితో రెండు కుటుంబాలూ ఎడమైనా, స్నేహం పోలేదు.

శంకరం గారు ఏడాదికి రెండు సార్లు తప్పకుండా మాధవరావు ఇంటికి వచ్చి వారం రోజులు ఉంటాడు. మాధవరావూ వెళ్తాడు. ఇద్దరూ గంటల తరబడి కబుర్లు చెప్పుకుంటూ పేకాడుకుంటారు.

**భవిష్యత్ జీవితం అంధకారబంధురం అవుతుందేమోననే సందేహంతో నరేంద్ర సతమతమవుతున్నాడు.**

మాములుగా మితభాషి అయిన మాధవరావు శంకరం గారితో అంత మాట్లాడటం నరేంద్రకు ఆశ్చర్యంగా ఉండేది.

శంకరం గారికి ఒక్కతే కూతురు. బి.యస్సీ చదువుతోంది. ఆ పిల్లను నరేంద్రకిచ్చి పెళ్ళి చేయాలని శంకరం గారి కోరిక. నరేంద్ర తండ్రి మాధవరావు, శాంతమ్మ, చెల్లెళ్ళు గిరిజ, వనజ అందరికీ ఈ సంబంధం అంటే ఇష్టమే. నరేంద్ర ఎలాగైనా ఒప్పుకుంటే బాగుండని ఎవరి ఇష్టదైవాలకు వాళ్ళు మనసులో మొక్కేసుకున్నారు.

శంకరం గారు నరేంద్రను తమ ఇంటికొచ్చి స్వర్ణను చూడమని అన్యాపదేశంగా చాలాసార్లు చెప్పారు. నరేంద్ర మాట్లాడలేదు. శాంతమ్మ సూటిగా స్పష్టంగా అడిగితే, తనకు పెళ్ళిచూపులు పడవన్నాడు.

తల్లి ఫోటో చూపించింది.

"ఫోటో చూసి పెళ్ళి చేసుకోమంటావా" అని తల్లి మీద ఇంతెత్తున ఎగిరాడు.

"పెళ్ళిచూపుల్లో పిల్లను చూడకా, ఫోటో చూసి నిర్ణయించుకోకా ఎలా చేసుకుంటావురా పెళ్ళి" అంది శాంతమ్మ.

"ప్రేమించి పెళ్ళాడతాడేమో" అంది పెద్ద చెల్లెలు వనజ.

"దానికైనా ఒక పిల్లంటూ ఉండాలా? ఆ పిల్లను వీడు చూడాలా? చేద్యం కాకపోతే!" శాంతమ్మకు కోపం వచ్చింది.

"ఆ పిల్లను చూసేసుకున్నాడేమో" అంది చిన్న చెల్లెలు గిరిజ.

చెల్లెళ్ళిద్దరూ నవ్వుతుంటే, శాంతమ్మ విసుక్కుంది.

చివరికి ఆ స్వర్ణను తీసుకుని శంకరం గారు వచ్చారన్న మాట. తననెవరో నిర్బంధించి పని చేయిస్తున్నట్లనిపించింది నరేంద్రకు. ఎవరితోనూ మాట్లాడకుండా, కనీసం చూపులు కలపకుండా బాత్‌రూం లోకి దూరాడు.

స్నానం చేస్తుంటే - ఈ స్వర్ణ మామూలు అమ్మాయేనేమో - తను సుఖంగా బతకగలడేమో అనిపించింది.

తన అనవసరపు పంతం మాని, ఈ అమ్మాయిని చూస్తే - సునందతో తను సుఖపడలేడు అని తన బుద్ధి తనకు చెబుతూనే ఉంది. అలాంటప్పుడు ఈ స్వర్ణతో సుఖపడగలడేమో? తనకు కావాల్సిన మామూలు అమ్మాయి స్వర్ణేనేమో?

ఉత్సాహంగా స్నానం ముగించి బయటికి వచ్చాడు.

అందరూ హాల్లో డైనింగ్ టేబుల్ దగ్గర చేరి మాట్లాడుకుంటూ టీవీ చూస్తున్నారు.

నరేంద్రను "రావోయ్ రా" అంటూ ఆహ్వానించారు శంకరం గారు. స్వర్ణ టీవీ మించి చూపు అప్రయత్నంగా నరేంద్ర మీదకు తిప్పింది.

నరేంద్ర తన చూపు వెంటనే తిప్పేశాడు.

ఇంతలో మాధవరావు "ఎంతసేపు చూస్తాం ఈ పాడు టీవీ. కాసేపలా చల్లగాలికి తిరిగొద్దాం రా" అంటూ శంకరం గారిని లేపి తీసుకెళ్ళాడు.

"పాడు వంట ఎంతకూ తెమల్దు అమ్మాయ్, ఒక్కరవ్వ ఉల్లిపాయలు తరిగిపెడుదూ" అని వనజను వెంటబెట్టుకుని వంటింట్లోకి వెళ్ళింది శాంతమ్మ.

గిరిజ ముందే ఎక్కడో మాయమయింది.

'కుట్ర చాలా పకడ్బందీగా జరుగుతోంది' అనుకున్నాడు నరేంద్ర.

"మీకు రెండేళ్ళున్నప్పుడు చూశానట మిమ్మల్ని మా అమ్మ చెబుతుంది" నవ్వుతూ పలకరించబోయాడు స్వర్ణను.

స్వర్ణ బిత్తరపోయి చూసింది.

"అప్పుడు మనం గుంటూర్లో పక్క పక్క ఇళ్ళలో ఉండేవాళ్ళం. నాకు ఆరేళ్ళు."

స్వర్ణ ముఖంలో ఏ చలనమూ లేదు. టీవీ చూస్తోంది.

"టీవీ రోజూ చూస్తారా?"

తల ఊపింది.

"ఏ ప్రోగ్రాం ఇష్టం?"

ఏమీ చెప్పలేదు.

"సంగీతం వింటారా?"

తల అడ్డంగా ఊపింది.

"సినిమాలు చూస్తారా?"

నవ్వింది? చూస్తానన్నట్లు.


"ఏ సినిమా ఎక్కువిష్టం?"

"ఘరానా మొగుడు నాలుగుసార్లు చూశాను."

నరేంద్రకు అక్కడ్నించి మాయమవ్వాలనిపించింది.

ఒకసారి స్వర్ణను తేరిపార చూశాడు.

చెవులకు బంగారు జూంకీలు....వచ్చరాళ్ళు మెరుస్తున్నాయి. మెళ్ళో ముత్యాల దండ.



చేతుల నిండుగా బంగారు గాజులు.

లేటెస్ట్ ఫాషన్ చీర. తల నిండా మల్లెపూలు.

ఈ కాస్ట్లీ అమ్మాయిని తను భరించగలడా?

"మీకు వంటొచ్చా?" అనుకోకుండా అడిగాడు.

"అంత బాగా రాదు. నేర్చుకోవాలి." భయంగా చెప్పింది స్వర్ణ.

గోళ్ళ రంగు చూసుకుంటూ, ఇంకా అడగబోయే నరేంద్ర ప్రశ్నలకు సిద్ధమైనట్లు కూచుంది.

నరేంద్రకు అనుమానం వచ్చి పెదవుల వంక చూశాడు. లేత రంగు లిప్‌స్టిక్‌తో తడితడిగా మెరుస్తున్నాయి.

"నూతన ఆర్థిక విధానం మన దేశానికి పనికొస్తుందంటారా?"

స్వర్ణ భయంగా, బిత్తరగా చూసింది.

"చెప్పండి" అన్నాడు నరేంద్ర, నవ్వు ఆపుకుంటూ.

"అదేమిటో నాకు తెలియదు" అంది స్వర్ణ.

"రోజూ పేపర్ చూడరా?"

"చూస్తాను."

"ఏం చదువుతారు మరి."

"సినిమా పేజీ, హెడ్డింగ్స్ చూస్తాను. ఏదైనా యాక్సిడెంట్లయితే అవీ."

నరేంద్రకు ఎందుకో హఠాత్తుగా తన మీద తనకి కోపం, అందరి మీద విరక్తీ వచ్చాయి.

లేచి చెప్పులు వేసుకుని, "అమ్మా - నేను మా కొలీగ్ సునందా వాళ్ళింటికి వెళ్తున్నా" అని అరిచి చెప్పి బయటపడ్డాడు.

టైము చూస్తే ఏడున్నరయింది.

'సునంద ఏం చేస్తుంటుంది? ఇప్పుడు తను వెళ్తే ఏమనుకుంటుంది? చూద్దాం. వెళ్ళాలనిపించినప్పుడు వెళ్ళటమే మంచిది' అనుకుని ఆటో పిలిచాడు.

సునంద ఇల్లు దగ్గరపడుతున్న కొద్దీ నరేంద్ర మనసులో మెల్లగా కలవరం మొదలయింది. 'తను వెళ్ళి కమిట్ అయిపోతాడా? సునందా, నిన్ను ప్రేమిస్తున్నాను' అని చెప్పేస్తాడా?

అప్పుడు సునందను పెళ్ళి చేసుకోవాలి. ఆ పెళ్ళి ఎలా ఉంటుంది? స్నేహితురాలిగా, భార్యగా పనికిరాదనుకున్న సునంద ఇంటికి వెళ్ళి తను ఏం చెప్పాలనుకుంటున్నాడు?

సునంద అంటే తనకు ఇష్టమే. చాలా ఇష్టం.

సునంద ముఖం అందంగా ఉంటుంది. ఆ అందం తనకు ఇష్టమే.

కానీ, ఆ అందంతో పాటు ఆమె కళ్ళు జ్ఞానంతో ప్రకాశిస్తుంటాయి. ఆ జ్ఞానం తాలూకు వెలుగు ఆమె ముఖమంతా ఆవరించుకుని ఉంటుంది. ఆ వెలుగంటేనే తనకు కొంత భయం.

ఆమె శరీరం కూడా అందంగానే ఉంటుంది.

ఎత్తూ, ఎత్తుకి తగ్గ లావూ అన్నీ బాగుంటాయి. కానీ, ఆమె ఆ శరీరంతో చాలా ఆత్మవిశ్వాసంగా నిలబడుతుంది. ఎక్కడా వంగదు. దేనినీ దాచాలని గానీ, ప్రదర్శించాలని గానీ ప్రయత్నం చెయ్యదు.

ఆ ప్రయత్నం చేయకపోవటం వల్ల వచ్చిన సహజమైన బిడియం లేని స్వేచ్ఛాప్రవృత్తి తనను భయపెడుతోంది. ఆమెతో పాటు పనిచేసే వాళ్ళను చూడటం లేదూ? భయంగా, సిగ్గుగా, కోపంగా ఉంటారెప్పుడూ.

తమ మీద దాడి జరుగుతుందనే భయంతోనూ, తాము ఎవరినైనా ఆకర్షిస్తున్నామా లేదా అన్న కుతూహలంతోనూ ఎప్పుడూ అశాంతిగా, అలజడిగా ఉంటారు వాళ్ళు.

సునంద అలా కాదు. స్థిరంగా, ధైర్యంగా, శాంతంగా ఉంటుంది. మిగిలిన ఆడపిల్లల్లా ఉండదు.

అదీ అసలు సంగతి.

ఆడపిల్లలా ఉండనిదాన్ని పెళ్ళాడితే తన గతేమిటి? ఏమవుతాడు? తగుదునమ్మా అని తనంతట తాను వాళ్ళింటికి వెళ్ళి...

'నిన్ను పెళ్ళాడుతాను' అని చెబుతాడనుకో -

తర్వాత ఆ మాట వెనక్కు తీసుకుంటే, సునంద తనను కాలరు పట్టుకుని కడిగి పారెయ్యదూ?

నన్నేమనుకుంటున్నావని కాళికలా విజృంభించదూ?

అసలా స్వర్ణను తీసుకొచ్చి తననీ గండంలో పడేశారు.

ఆ స్వర్ణ సుడిగుండంలా కనపడితే దిక్కుతోచక తను ఊబిలో దూకేయబోతున్నాడా?

నరేంద్ర సునంద ఇంటి బయటే ఒక పావుగంట నిలబడి తలుపు తట్టకుండా తిరిగొచ్చేశాడు.

ఇంటికెళ్ళే సరికి అందరూ భోజనాలు చేసి ఎవళ్ళ పనుల్లో వాళ్ళున్నారు.

శాంతమ్మ లేచి అన్నం పెట్టింది. తనకు చాలా కోపంగా ఉందని తెలిసేలా ఒక్క మాట మాట్లాడకుండా వడ్డించింది. నరేంద్ర కూడా కిక్కురుమనకుండా తిని పడుకుని నిద్రపోయాడు.

* * *

"సునంద అంటే ఎవర్రా?" వారం రోజుల కోల్డ్ వార్ తర్వాత ఇక లాభం లేదని ప్రశ్నించింది తల్లి. నరేంద్ర ప్రశ్నలకు కోపం తెచ్చుకున్న స్వర్ణ, తను నరేంద్రను చేసుకోనని తెగేసి చెప్పింది.

నరేంద్ర హాయిగా, మిగిలినవాళ్ళు బాధగా నిట్టూర్చి ఊరుకున్నారు.

ఐతే, పాతికేళ్ళు దాటుతున్న కొడుకుని ఎలాగోలా ఓ ఇంటివాడిని చెయ్యాలనే ప్రయత్నం ఆపలేదు శాంతమ్మ.

అందుకే వనజను, గిరిజను బతిమాలి సునంద పేరు తెలుసుకుంది.

నరేంద్ర చెప్పాడు - "మా ఆఫీసులో నాతోపాటు ఉద్యోగం చేసే అమ్మాయి."

"ఆ పిల్లంటే నీకిష్టమా?"

**సునంద స్థిరంగా, ధైర్యంగా, శాంతంగా ఉంటుంది. మిగిలిన ఆడపిల్లల్లా ఉండదు. అలా ఉండని దాన్ని పెళ్ళాడితే తన గతేమిటి?**

నరేంద్ర సందేహంగానే తలాడించాడు.

"పోనీ, ఆ పిల్లనే చేసుకో - అడిగావా ఆ పిల్లని?"

మళ్ళీ తలాడించాడు అడ్డంగా.

"మమ్మల్ని వెళ్ళి చూడమంటావా? అడగమంటావా?"

"ఒద్దొద్దు." కంగారుగా అని, తింటున్న ఇడ్లీముక్క గొంతుకడ్డం పడితే గుటగుటా మంచినీళ్ళు తాగాడు.

"అదేం" అని ఆశ్చర్యపోయిన శాంతమ్మ, అంతలోనే ముఖం విషాదంగా పెట్టి —

"మేం నీకింత శత్రువులం ఎందుకయ్యాంరా? నీకిష్టమైన పిల్లనే చేసుకో. ఆ పిల్లని మేం చూస్తే ఏమవుతుంది? నీకు పెళ్ళాన్ని వెతకటానికి పనికిరాం. సరే, నువ్వు వెతుక్కున్న పెళ్ళాన్ని చూడటానికి కూడా పనికిరామా?" దుఃఖం బిగబట్టి ముక్కు ఎగబీల్చింది శాంతమ్మ.

"అబ్బా - అది కాదమ్మా - నేనే ఇంకా నిర్ణయించుకోలా." ఇక తల్లి మాటలు చెవిని పెట్టకుండా ఆఫీసుకు వచ్చేశాడు.

సాయంత్రం నరేంద్ర ఇంటికెళ్ళేసరికి రాంమోహన్ వచ్చి ఉన్నాడు. రాంమోహన్, నరేంద్రకు పెద్దమ్మ కొడుకు. నరేంద్ర కంటే ఇరవై ఏళ్ళు పెద్దవాడు. ఐనా, నరేంద్ర వయసున్నట్లే నరేంద్రతో స్నేహం చేస్తాడు. ఆయన హైదరాబాదు వస్తే నరేంద్ర వాళ్ళింటికి తప్ప ఇంకో చోటికి వెళ్ళడు. ఆ ఇంట్లో నరేంద్రతో తప్ప మరొకరితో మాట్లాడడు.

"నా మాటలు కాస్తో కూస్తో వాడికే అర్థమవుతాయి" అంటాడు మిగిలిన వాళ్ళతో.

నలభయ్యయిదేళ్ళు వచ్చినా, జీవితంలో స్థిరత్వం కోసం ఇల్లు కట్టకుండా, ఉద్యోగాల్లో ప్రమోషన్ల కోసం ప్రయత్నించకుండా ఏవో సంఘాలు, మీటింగులు అని తిరిగే రాంమోహన్ మీద బంధువులెవరికీ సదభిప్రాయం లేదు.

తనున్న ఈ క్లిష్ట సమయంలో వచ్చిన రాంమోహన్ అన్నయ్య అగ్నిప్రమాదం జరక్కముందే వచ్చిన ఫైరింజన్‌లా కనిపించాడు నరేంద్ర కళ్ళకు.

అన్నయ్యను నిలవనీయకుండా బయటికి లాక్కొచ్చాడు. టాంక్‌బండ్ మీద కూలేసి వేరుసెనగ పప్పులు కొని, ఆయన దోసిట్లో పోసి, తన ప్రేమ గురించి ఒక్కబిగిని చెప్పేశాడు. సునంద గురించి తనకు తెలిసిందంతా చెప్పేశాడు. తన భయాలూ, సందేహాలూ అన్నీ చెప్పేశాడు.

"నువ్వు చెప్పు అన్నయ్యా - నా భయాలు అనవసరమంటావా? సునందను పెళ్ళి చేసుకోవటం అవివేకమేనంటావా?" రాంమోహన్ జాలిగా నరేంద్ర వంక చూశాడు.

"ఒరే, నా పెళ్ళి ఎప్పుడయిందిరా?"

"నా ఐదో ఏట."

"అవును. 1970లో అయింది. అప్పటికీ, ఇప్పటికీ ఎంత మారిపోయారు."

"ఎవరు?" ఆశ్చర్యంగా అడిగాడు నరేంద్ర.

"యువకులు. నీలాంటి యువకులు. మాలాంటి వాళ్ళం అప్పుడు ఇలాంటి అమ్మాయిల కోసం వెతికే వాళ్ళం. మా ఎ.సి కాలేజీ మొత్తంలో కాస్త చురుగ్గా ఆత్మవిశ్వాసంతో ఉన్న అమ్మాయిలు నలుగురే ఉండేవారు. వాళ్ళు నాకంటే తెలివైనవాళ్ళను ప్రేమించేశారు. ఏం చెయ్యను?

ఏ సభకెళ్ళినా, ఏ ఊరెళ్ళినా, ఏ పాట కచ్చేరీకి వెళ్ళినా వెతికే వాణ్ణి. నాతో సమంగా అన్నిటినీ పంచుకోగల అమ్మాయి కోసం.

జ్ఞానంతో ప్రకాశించే కళ్ళు గల అమ్మాయి కోసం - సిగ్గుపడకుండా నా పక్కన ధీమాగా నిలబడగల అమ్మాయి కోసం. అప్పుడు అలాంటి అమ్మాయిలు తక్కువ.

ఇప్పుడు అమ్మాయిలలా ఉంటే నీలాంటి వాళ్ళి లాంటి చవట సందేహాలతో —

నా భార్యని పేరు పెట్టి పిలవమని పదేళ్ళు బతిమాలుకున్నాను. ఇప్పటికీ అదో కల.

నా యౌవ్వనంలో అతి సుందర స్వప్నం ఏమిటో తెలుసా? నన్ను ప్రేమించే, నేను ప్రేమించే అమ్మాయి నా భుజం మీద చేయి వేసి -

అరేయ్ - ఈ పుస్తకం చదివావా?

ఒరేయ్ - ఈ పాట విన్నావా?

అంటూ ఓ స్నేహితుడిలా నన్నంటిపెట్టుకుని ఉండాలని.

ఏ సమస్య వచ్చినా అలా కాదురా ఇలా చేద్దాం అని ఒకరికొకరం ధైర్యం చెప్పుకోవాలని —



నా కల నిజం కాలేదు.

ఒంటరివాడిని - ఆనందానికీ, విషాదానికీ కూడా.

మీ వదిన మంచిదే. అనుకూలవతే, నాకేం కంప్లయింట్లు లేవు.

కానీ, ఆమె నా భార్య. అంతే - నా స్నేహితురాలు కాదు. నువ్వు భార్యనెందుకు కోరుకుంటున్నావురా?

నీకో స్నేహితురాలు కావాలనుకో. ఆఫీసులో, పార్కులోనే కాదు. ఇంట్లో, నీ గదిలో, నీ హృదయంలో కూడా నీతో పాటు ఉంటుంది.

అదెంత అదృష్టమో నీకు అర్థం కావటం లేదూ? ఆత్మగౌరవం గల అమ్మాయే నీ గౌరవాన్ని కాపాడుతుందిరా.

అది లేని పిల్ల, బానిసలా పడుండే పిల్ల నిన్నూ దేనికో దానికి బానిసగా చెయ్యాలని చూస్తుంది. నీ అదృష్టం బాగుండి సునంద నీకు తటస్థపడింది. ఇంకా మీనమేషాలు లెక్కించకు.''

రాంమోహన్ మాటలతో నరేంద్ర భయాలు కొన్ని వెనక్కు తగ్గాయి. ముఖం కొన్ని వికసించింది.

సునందతో ఈ విషయం మాట్లాడాలనే నిర్ణయానికి వచ్చాడు.

* * *

> **ఆత్మగౌరవం లేని పిల్ల, బానిసలా పడుండే పిల్ల నిన్నూ దేనికో దానికి బానిసగా చెయ్యాలని చూస్తుంది అన్నాడు రాంమోహన్.**

ఆదివారం పొద్దున్నే నిద్ర లేచి గంటసేపు షేవ్ చేసుకుంటున్న సేపం మీద అద్దం ముందు నిలబడి ఆత్మపరీక్ష, దేహపరీక్ష ఏకకాలంలో కానిచ్చి, తలస్నానం చేసి, మంచిగా తయారయ్యాడు నరేంద్ర.

సునందతో మాట్లాడటానికి ఆ రోజు ముహూర్తం పెట్టుకున్నాడు. సునంద ఇల్లు బయట నుంచి చూడటమేగాని లోపలకు ఎన్నడూ వెళ్ళలేదు.

రెండు నెలల క్రితం తట్టటానికి భయపడిన తలుపు ఇప్పుడు ధైర్య సంకోచాలను మిలాయించి తట్టాడు.

తలుపు తెరుచుకుంది. సునంద ముఖం సంతోషంతో విచ్చుకుంది.

''ఆశ్చర్యం, ఆనందం. రండి, రండి'' అని తెలుగులో ఆహ్వానించింది.

పెద్ద హాలు, వెనుక వంటగది, పక్కగా బెడ్‌రూం. సునంద ఇల్లు చూడగానే నచ్చింది నరేంద్రకు.

''ఏం చేస్తున్నారు?'' అడిగాడు.

''ఏం చెయ్యాలా అని చూస్తున్నా. ఇవాళెందుకో చాలా ఉత్సాహంగా, సంతోషంగా ఉంది. లేచిన దగ్గర్నుంచీ ఏదో చెయ్యాలనిపిస్తోంది. గులాబ్‌జాములు చేశా - నాకిష్టమైన పాటలు ఫుల్ వాల్యూంలో పెట్టి విన్నా. ఇప్పుడే డాన్స్ చేద్దామనుకుంటుండగా మీరు వచ్చారు'' నవ్వుతూ చెప్పి, లోపలకు వెళ్ళి, ఓ కప్పులో గులాబ్‌జాములూ, మంచినీళ్ళూ తెచ్చింది.

నరేంద్ర చాలా ఆనందంగా గులాబ్‌జాములు అందుకున్నాడు.

''మీకు వంట వచ్చా? వండుతారా?''

''ఏం - నేనొక్కదాన్నీ ఉంటే ఏం తినకుండా ఉసూరుమంటూ ఉంటాననుకున్నారా - అలా ఉండే నిర్భాగ్యులు మీ మగవాళ్ళు. నేను తినాలని అనిపించినవన్నీ చేసుకుని తింటాను. బద్ధకం వేసినప్పుడు హొటల్లో తింటాను.''

ఏమైతేనేం, సునందకు వంట వచ్చనే విషయమే ఆనందంగా ఉంది నరేంద్రకు.

తృప్తిగా మరో రెండు గులాబ్‌జాములు అడిగి పెట్టించుకున్నాడు.

''మీరొక్కరే ఉంటారని కూడా తెలియదు. మీకు చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ -''

''లేరు - మా ఇంట్లో నేనే చిన్నదాన్ని. ఒక అక్క, ఇద్దరన్నలూ, అమ్మా నాన్నా అందరూ ఉన్నారుగానీ, ఎవ్వరూ లేరు.'' తమాషాగా నవ్వింది.

''అదేంటి?'' ఆశ్చర్యపోయాడు.

''నేనే అందర్నీ వదిలేశా - మా నాన్న ఒక రాక్షసుడు. ఇంట్లో అందరినీ అణచి తన గుప్పిట్లో ఉంచుకోవటమే ఆయన జీవితాశయం. డబ్బు సంపాదిస్తాడు - ఆ డబ్బు చూసి అందరూ బానిసల్లా పడుండాలని ఆయన ఉద్దేశం. మిగిలిన వాళ్ళందరూ అలా పడున్నారుగానీ, నేను అలా లేను. నా పదిహేనవ ఏట నుంచీ ఆయనకూ నాకూ యుద్ధం. నా చదువు మాన్పించి, తన చెల్లెలి కొడుక్కిచ్చి పెళ్ళి చేయాలని ఆయన -

చదువుకోవాలని నేను -

ఇంటర్ పాసవగానే ఇంట్లోంచి వచ్చేశాను. చిన్న ఉద్యోగం చేస్తూ చాలా కష్టపడి చదువుకున్నాను.

నాకు ఇంజనీరింగ్ చదవాలని ఆశ. చదివించగల శక్తి మా నాన్నకుంది. కానీ, అంత మంచి మనసు లేదు. నేను బి.ఎ చదివి ఎ.పి.పి.యస్.సి పరీక్షలు రాసి, ఈ ఉద్యోగంలో సెటిలయ్యాను. ఇప్పుడు ఎమ్మే కూడా అయిందనుకోండి.

ఎప్పుడన్నా మా అమ్మను చూడాలనిపిస్తే నేనే వెళ్తాను. వాళ్ళెవరూ రారు.''

నరేంద్ర ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని వింటున్నాడు. 'ఎప్పుడూ నవ్వుతూ ఉండే సునంద ఇన్ని కష్టాలు పడిందా?' సునంద తండ్రి మీద నరేంద్రకు అసహ్యం వేసింది. 'అందుకే సునందకు మగవాళ్ళంటే అంత ద్వేషం. తను సునందను సుఖపెడతాడు. కష్టాలు లేకుండా చేస్తాడు.'

నరేంద్రకు సునందపై ప్రేమతో మనసు నిండిపోయింది. అదంతా అతని కళ్ళలోకి వచ్చింది.

ప్రేమపూరితమైన నరేంద్ర కళ్ళు సునంద మనసుకు హాయిగా అనిపించాయి. ఆమె ఉత్సాహం మరింత ఎక్కువైంది.

''డాన్స్ చెయ్యనా? చూస్తారా? ఒక్క సంవత్సరమే నేర్చుకున్నాను. స్టేజి మీద చెయ్యటానికి సరిపోదు. నేను ఇంట్లో సరదా పుట్టినప్పుడల్లా చేస్తాను.''

టేప్ రికార్డర్ పెట్టి వచ్చింది.

పొందికగా ఉన్న శరీరం అందంగా, లయబద్ధంగా కదులుతోంది.

నరేంద్రకు పరవశంతో ఒళ్ళు తెలిక అయిపోయింది.

అరగంట తర్వాత ఆయాసంగా వచ్చి కూచుంది.

''అభినందించరేం?'' - నవ్వింది.

''చాలా బాగుంది. మీరెంతో బాగున్నారు.''

సునంద చెయ్యి పట్టుకుని అభినందించి, మరి ఆ చేతిని వదల్లేకపోయాడు.

సునంద కూడా వదిలించుకునే ప్రయత్నం చేయలేదు.

''సునందా, నా గురించి మీ అభిప్రాయమేమిటి?''

ఒక రకమైన మత్తులో, ట్రాన్స్‌లో ఉన్నట్లు అడిగాడు.

కిలకిలా నవ్వింది సునంద.

''మీరు మంచివాళ్ళే. కొన్ని బలహీనులు అని నా అభిప్రాయం. మీ అభిరుచులూ, భావాలూ అన్నీ నాకు నచ్చుతాయి.''

''నేను నచ్చుతానా?''

''నచ్చుతారు!'' సునంద, నరేంద్ర కళ్ళలోకి చూసింది.

ఇద్దరిలోనూ ఒక రకమైన ప్రేమావేశం కలిగింది. ఒక ఉద్రేకపూరితమైన ఆకర్షణ చెలరేగింది.

నరేంద్ర తలను హఠాత్తుగా దగ్గరకు లాక్కుని అతని పెదవుల మీద ముద్దు పెట్టింది సునంద.

నరేంద్ర ఆమెను వదలలేకపోయాడు. దగ్గరగా తీసుకున్నాడు.

కాలం కొంతసేపు వారిద్దరినీ సునందా నరేంద్రలని మరపింపజేసి, ఇద్దరు స్త్రీ పురుషులని మాత్రమే గుర్తుండేలా చేసింది.

''ఈ రోజెంత బాగుంది.''

సునంద మనస్ఫూర్తిగా సంతోషంగా అంటుంటే నరేంద్ర ఆనందానికి అవధులు లేవు.

సాయంత్రం వరకూ కాలం ఎట్లా గడిచిందో వారికి తెలియదు. సాయంత్రం ఐదు గంటలకు సునంద స్నేహితురాలు మాధవి తన పిల్లల్ని తీసుకుని వచ్చి తలుపు తడితే అయిష్టంగా వెళ్ళి తలుపు తీశాడు నరేంద్ర.

మాధవిని పరిచయం చేసింది సునంద. మాధవి రావటమే పెద్ద ఆవేశంలో వచ్చింది. నరేంద్రను సరిగ్గా పలకరించకుండానే సునందతో తన కష్టాల గురించీ, భర్త దౌష్ట్యం గురించీ, అతనితో తనిప్పుడు పడిన తగవు గురించీ చెప్పటం మొదలు పెట్టింది.

నరేంద్ర వెళ్ళొస్తానని లేచాడు.

మర్నాడు ఆఫీసులో సునంద తనతో ఎప్పటిలాగానే ప్రవరిస్తుంటే నరేంద్రకు ఆశ్చర్యం అనిపించింది. అతనికి సునంద మీద ఏదో ఒక చనువు, ఒక హక్కు, అధికారం వచ్చినట్లుంది. దాన్ని చూపించడం ఎట్లాగో చూపించకుండా ఉండటం ఎట్లాగో అతనికి అర్థం కావటం లేదు. సునంద తమ మధ్య ఏమీ జరగనట్లు ఎలా ఉండగలుగుతోందో కూడా అతనికి అర్థం కాలేదు.

ఆ రోజు ఆఫీసులో రిటైరవుతున్న కొలీగ్‌కు ఫేర్‌వెల్ పార్టీ ఉంది. సునంద ఆ పనులన్నీ నెత్తి మీద వేసుకుని క్షణం తీరిక లేకుండా ఉంది. పార్టీ పూర్తయి, అందరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళి, వీళ్ళిద్దరికీ ఏకాంతం దొరికే సరికి ఎనిమిదిన్నర అయింది.

''ఒక్కళ్ళే ఎలా వెళ్తారు? నేను వచ్చి దించి వెళ్ళనా?'' నరేంద్ర ప్రేమగా అడిగాడు.

''అదేంటి కొత్త పద్ధతులు. నాకేం భయం లేదు. మీకు రావాలనిపిస్తే రండి. రేపు ఉదయం వెళ్దురుగాని'' అల్లరిగా, అర్థవంతంగా నవ్వింది.

నరేంద్రకు వెళ్ళాలనే ఉంది. కానీ, ఇంట్లో చెప్పలేదు. రాత్రంతా ఇంటికి రాకపోతే కంగారు పడతారు.

''ఇంట్లో అమ్మావాళ్ళు ఎదురు చూస్తుంటారు.''

''మరింకేం. వెళ్ళండి. నేను బస్సులో సురక్షితంగా వెళ్తాను. దిగులు పడకండి.''

ఇంతలో బస్ రానే వచ్చింది.

మరో రెండు ఆదివారాలు వాళ్ళ మధ్యకు మనోహరంగా వచ్చి వెళ్ళాయి. తర్వాత సునంద తల్లికి బాగోలేదని ఉత్తరం వస్తే ఊరు బయల్దేరింది.

''నా గురించి మీ అమ్మకు చెబుతావా?'' నరేంద్ర నవ్వుతూ అడిగాడు.

"అమ్మకు బాగుంటే చెప్తాను. ఆమె బాధ పడుతుంటే నా సంతోషాన్ని ఎలా చెప్తాను?"

"నీ సంతోషాన్ని చెబితే ఆమె బాధ పోతుందేమో."

"ఆమెదలా పోయే బాధ కాదు. మా నాన్నను పెళ్ళి చేసుకున్న రోజే ఆమె బాధను గుండెల మీద కూర్చోబెట్టుకుంది. మా నాన్న పోవాలి లేదా ఆమె పోవాలి." సునంద మూడ్ బాగోలేదని గ్రహించాడు నరేంద్ర.

సునంద పదిహేను రోజుల తర్వాత వచ్చింది. ఆఫీసుకు రాకుండా నరేంద్రను ఇంటికి రమ్మని ఫోన్ చేసింది.

తల్లికి టైఫాయిడ్ వచ్చి తగ్గిన విధం, తను చేసిన సేవలు, తండ్రి అహంకారం అన్నీ చెప్పింది. సునంద విరహంలో ఎలా వేగిపోతున్నాడో నరేంద్ర చెప్పాడు.

"సునందా, ఇంక ఇట్లా దూరంగా ఉండటం నా వల్ల కాదు. పెళ్ళి ఎప్పుడు చేసుకుందాం చెప్పు, మా ఇంట్లో ఏ అభ్యంతరమూ లేదు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. నీదే ఆలస్యం."

సునంద ఒక్క క్షణం చిత్రంగా చూసి నవ్వేసింది.

"చెప్పు. ఏ నెల, ఏ తారీకు, రేపే అంటే కూడా నేను రెడీ."

నరేంద్ర వంక ప్రేమగా, జాలిగా చూసింది సునంద.

"అలా చూస్తావేంటి. చెప్పు" సునంద ఎంతకూ మాట్లాడకపోతుంటే నరేంద్ర రెట్టించాడు.

"పెళ్ళి అంటే ఏం చెయ్యాలనుకుంటున్నావు?" నరేంద్ర ఆశ్చర్యపోయాడు.

"ఏం చేసేదేమిటి? పెళ్ళి చేసుకుంటాం. ఓహ్, అదా - రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుందాం. ఆ పురోహితుల పెళ్ళిళ్ళు నాకు ఇష్టం లేదు. ఇంత పెద్ద వాళ్ళమై చిన్న పిల్లల్లా తలంబ్రాలు పోసుకుంటూ, బిందెలో ఉంగరాలు వెతుక్కుంటూ..." నవ్వేశాడు.

సునంద నవ్వలేదు.

"పెళ్ళి ఎలా జరుగుతుందని కాదు నా ప్రశ్న పెళ్ళయ్యాక ఏం జరుగుతుందని?"

నరేంద్ర ఈసారి పూర్తిగా నివ్వెరపడిపోయాడు.

"మనిద్దరం కలిసి మీ ఇంట్లో కాపురం పెడతాం. అంతేనా?"

"ఆఁ!" అంతకాక మరేమిటన్నట్లు చూశాడు.

సునంద మళ్ళీ మౌనం వహించింది.

"మనిద్దరం వేరే ఇల్లు తీసుకోవాలనా నీ ఉద్దేశం. పోనీ అలాగే చేద్దాం."

ఇప్పుడిలా ఉంటే ఏమైంది నరేంద్రా? ఇది నా ఇల్లు. నీ కిష్టమైనప్పుడు రావొచ్చు. మనకిష్టమైనప్పుడు మనం కలిసి గడువుతున్నాం గదా. పెళ్ళి, సంసారం - ఇద్దరం కలిసి మొగుడూ పెళ్ళాల్లా రోజూ పోట్లాడుకోవటం - ఇదంతా నాకు ఇష్టం ఉండదు. ఇప్పుడు అలా జీవించటానికి నేను సిద్ధంగా లేను. కొంతకాలం ఇలా గడవనివ్వు. పెళ్ళి ప్రసక్తి తేవద్దు."

నరేంద్ర ముఖం తెల్లగా పాలిపోయింది. సునంద మాటలు అతనిలో భయాన్నీ కోపాన్నీ ఒకేసారి కలిగించాయి. సునంద ఏమంటోందో తేటతెల్లమవుతున్నకొద్దీ అతనికి భావం మరింత పెరిగిపోతోంది.

"అలా ఎక్కడైనా జరుగుతుందా?"

"నా మీద నీకే హక్కులూ వద్దా."

"నిన్ను అణిచివేసే హక్కులేమీ వద్దు. అలాగే నా మీద నీకలాంటి హక్కులు ఉండవు."

"జోక్ చేస్తున్నావా? అసలిలా బతకటం ఎలా సాధ్యం? మా అమ్మా, నాన్నా చెల్లెళ్ళూ, మన కొలీగ్స్ - సమాజంలో అందరూ ఏమనుకుంటారు? వాళ్ళకేం చెబుతాం? ఏం చేద్దాం?"

"నేను నా కోసం, నాదంటూ ఇంత చోటు కోసం మా కుటుంబాన్నంతా వదిలి వచ్చాను. ఆ చోటును కొత్త కొత్త తేడాలతో అలాంటి కుటుంబాన్ని ఇంకోదాన్ని నిర్మించటం కోసం వదిలెయ్యలేను.

మన ప్రేమ కోసం మీ వాళ్ళతో నువ్వెలా అడ్జస్ట్ కాగలవో ఆలోచించుకో. ప్లాన్ చేసుకో. సమాజం గురించి భయపడతావెందుకు? మనం జీవించబోయే పద్ధతికి సమాజమంతా రావాలి. కొత్త పద్ధతుల్ని చూసి మొదట సమాజం ఎప్పుడూ భయపడుతుంది. ఆ భయాన్ని మనం పోగొట్టాలి."

సునంద మాట్లాడే ప్రతి మాటకూ నరేంద్ర కోపం పెరుగుతోంది.

"మనం ఇలా ఎవరి చోటు వారికి కావాలని కూచుంటే మన పిల్లల సంగతేమిటి?"

తిరుగు లేని ప్రశ్న వేశాననుకున్నాడు.

"పిల్లలా?" సునంద ఆశ్చర్యంగా చూసింది.

అంతకంటే విస్తుపోయి చూశాడు నరేంద్ర, పిల్లలంటే ఆశ్చర్యపడుతున్న సునందను.

"పిల్లల్ని గురించి నేనింతవరకూ ఆలోచించలేదు. ఏమో! పిల్లల్ని కనాలనిపిస్తే అప్పుడు ఆలోచించవచ్చు. నేను పిల్లల్ని కని పెంచగలుగుతానో లేదో? అది చాలా పెద్ద బాధ్యత గదా! చాలా జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. కంటానో లేదో తెలియని పిల్లల కోసం ఇప్పట్నించీ నా జీవిత విధానాన్ని మార్చుకోవటం ఎలా కుదురుతుంది?"

ఇక మాట్లాడటానికేమీ లేదనిపించింది నరేంద్రకు.

పిల్లల్ని కనాలా వద్దా అని ఆలోచించుకోవాలిట. ఈ సునందను తను భరించలేడు.

ఈమె మగవాళ్ళతో సమానత్వమనే పరుగులో, ఆత్మగౌరవమనే పందెంలో వికృతమైన ఆలోచనలు చేస్తోంది. అనవసరం.

"నేను మంచివాడినే కాని, చాలా మామూలు మనిషిని సునందా. ఒక స్త్రీతో జీవితం పంచుకుని, పిల్లల్ని కని సాధారణంగా బతకాలనుకుంటున్నాను. నా జీవితంలో ప్రయోగాలు చెయ్యాలనుకోవటం లేదు."

ఎంత అణచుకోవాలనుకున్నా నరేంద్ర గొంతులో కోపం, వ్యంగ్యం అణగలేదు. సునంద రెండు నిమిషాలు నరేంద్ర వంక అలాగే చూసింది. ఆమె కూడా కోపాన్ని కంట్రోలు చేసుకునే ప్రయత్నం చేసి, జయించి చిన్నగా నవ్వింది.

"మామూలుగా ఇక్కడితో మనం మాటలు ఆపేసి ఎవరి దారిన వాళ్ళం వెళ్ళిపోవచ్చు నరేంద్రా. కానీ, నా ఆలోచనల మీద మీకు నిరసన, చిన్నచూపు ఉన్నాయని తెలిశాక నాకు కూడా మీరు సాధారణంగా, మామూలుగా గడపబోయే జీవితం ఒక పెద్ద ప్రయోగమని చెప్పాలనిపిస్తోంది. నిజం. మీరు మామూలు జీవితం అనుకుంటూ పెద్ద ప్రయోగం చెయ్యబోతున్నారు. మీరే కాదు,

> **"కొత్త పద్ధతుల్ని చూసి మొదట సమాజం ఎప్పుడూ భయపడుతుంది. ఆ భయాన్ని మనం పోగొట్టాలి" అంది సునంద.**

"ఎందుకు జరగకూడదు?"

"ఇక మనం ఏమిటి?"

"స్నేహితులం - ప్రేమికులం."

"ఇద్దరం ప్రేమికుల నుంచి భార్యాభర్తలుగా మారి ఒకే ఇంట్లో ఉంటే ఏమవుతుంది?"

"సర్వనాశనమవుతుంది. మనం ఎదిగినవాళ్ళం. ఎవరి జీవిత విధానం వారికి వేరుగా ఉంటుంది. దానిని డిస్టర్బ్ చేయకుండా మనం ప్రేమించుకోలేమా?"

"నేను నిన్ను మోసం చేస్తే?"

సునంద తెలివి తక్కువగా మాట్లాడుతోందని నరేంద్రకు రూఢి అయింది.

సునంద నవ్వి నవ్వి అలసిపోయింది.

"అంటే ఏం చేస్తావు?"

"కొన్నాళ్ళిలా నీతో గడిపి ఆ తర్వాత ఇక నీ దగ్గరికి రాకపోతే, నీ ముఖం చూడకపోతే అప్పుడేం చేస్తావు?"

"నీ మీద అనుమానంతో మొదలెట్టమంటావా మన సంసారం? లేక నా మీద నీకా అనుమానమా? ఏదైనా ఒకటే గదా. నా దగ్గరకు నువ్వు రాకపోయినా, నీ దగ్గరకు నేను రాకపోయినా అర్థం ఏమిటి? ప్రేమ పోయిందనేగా. ప్రేమ పోయాక ఇంకా కలసి ఉండటం ఏమిటి? అలా ఉండాల్సి వస్తుందనే కదూ పెళ్ళి వద్దనడం."

నరేంద్ర తల గిర్రున తిరుగుతోంది.

లక్షలాది స్త్రీ పురుషులు అలాగే అనుకుంటున్నారు. కానీ, ఆ ప్రయోగం కేవలం స్పెక్యులేషన్ మీద ఆధారపడి చేసేది. ఏం పరవాలేదని మిమ్మల్ని బరిలోకి తోసే సమాజం, ఆ తర్వాత ప్రయోగశాలలో చేతులు కాల్చుకున్న మిమ్మల్ని గురించి పట్టించుకోదు. మీరు చాలా ఒంటరి అవుతారు. అప్పుడు మీ జీవితం మామూలు జీవితం కాదు. ప్రత్యేకమైన జీవితం అని తెలిసి వస్తుంది. కానీ, మీరు వెనక్కి రాలేరు. జీవితాంతం అదే ప్రయోగశాలలో పదే పదే అదే ప్రయోగం మళ్ళీ మళ్ళీ చేస్తూనే ఉండాలి.

కాస్త కళ్ళు విప్పి చూస్తే - మెదడు పెట్టి ఆలోచిస్తే మీకే అర్థమవుతుంది.

నా జీవితంతో నేను ప్రయోగాలు చేస్తానేమోగాని చాలా భద్రమైన వాతావరణంలో, సైంటిఫిక్‌గా, ఒక కొత్త సృష్టి కోసం ఆరాటపడే శాస్త్రవేత్తలా చేస్తాను.

అందులో నాకు పెద్ద శాంతి, సుఖం ఉంది. కోట్ల మంది మూర్ఖంగా చేసి విఫలమైన ప్రయోగశాలలో అది బొత్తిగా ఇసుక పునాది అని తెలిసీ, అక్కడ అడుగు పెడితే నేనంటూ మిగలనని తెలిసీ - నేను అడుగు పెట్టను.

నేను చాలా తెలివైనదాన్ని. నా జీవితం విలువ తెలిసినదాన్ని."

గర్వంగా దూసుకొచ్చిన సునంద మాటలు నరేంద్రను మరింత పిచ్చివాడిని చేశాయి.

ఇక మాట్లాడటానికేమీ లేదని ఇద్దరికీ తెలిసిపోయింది. నరేంద్ర వెళ్తున్నానని కూడా చెప్పకుండా అక్కడ్నించి లేచి వెళ్ళిపోయాడు.

* * *



నాలుగైదు నెలలు గడిచిపోయాయి. మొదటి నెలలో సునందతో మామూలుగా మాట్లాడటానికి కూడా నరేంద్ర చాలా ఇబ్బంది పడ్డాడు.

సునంద ఒక రోజు పనిగట్టుకుని క్యాంటీన్‌కు వెళ్దాం రమ్మని పిలిచి -

"మనిద్దరి మధ్యా ఒక విషయం జరిగింది. దాన్ని గురించి మనం ఏమీ చెయ్యలేం. ఎవరి అభిప్రాయాలు వారివి. దాన్ని పక్కన పెట్టి మనం స్నేహితుల్లా ఉందాం. మీకు ఆమాత్రం సత్తా ఉందనే నేను అనుకుంటున్నాను. లేకపోతే అలాంటి బలం తెచ్చుకోవటానికి ఇది మంచి అవకాశం. నేను సహాయం చేస్తాను."

సునందకు ఏం సమాధానం చెప్పాలో నరేంద్రకు తెలియలేదు. క్రమంగా మామూలు విషయాలు మాట్లాడుకోసాగారు. సునందను కోల్పోతున్నానని నరేంద్రకు ఒక్కోసారి అనిపించేది. కానీ, అసలామె తనకు సొంతం ఎన్నడూ కాదు. అలాంటి ఆమెను కోల్పోవటం ఎలా కుదురుతుంది అనిపించేది. కానీ, సునంద మీద కోపం, కసి స్థిరపడిపోయాయి. తనలాంటి మనిషి కూడా దొరక్క ఆమె ఒంటరిగా మిగిలిపోతుంది.

నేను మామూలు అమ్మాయిని పెళ్ళాడి పిల్లలతో హాయిగా ఉంటాను.

కొందరి జీవితాలంతే అనుకునేవాడు.

నరేంద్ర పెళ్ళి చేసుకోవాలనే ఒత్తిడి పెరుగుతోంది ఇంట్లో.

శంకరంగారమ్మాయి స్వర్ణ పెళ్ళి శుభలేఖ వచ్చిన రోజు ఇంటిల్లిపాదీ నరేంద్రను శత్రువులా చూశారు.

"మంచి సంబంధం. తెలిసిన కుటుంబం. హాయిగా ఉండేది అందరికీ. చేతులారా పాడు చేసుకున్నావు" అంటూ శాంతమ్మ పదిసార్లు కంట తడి పెట్టుకుంది.

ఆ సంగతి సునందతో కబుర్ల మధ్య చెప్పాడు నరేంద్ర.

"అసలా స్వర్ణ మంచి అమ్మాయేమో, మీకు చిన్నప్పట్నించీ తెలిసిన కుటుంబం కదా, ఎందుకొద్దన్నారు?"

సునంద నరేంద్ర పెళ్ళి విషయంలో పెద్దరికం వహించినట్లు అడిగింది.

"చెప్పాలంటే నేను ఒద్దనలేదు. ఒకరోజు ఆ అమ్మాయి మా ఇంటికొస్తే ఓ ప్రశ్న వేశాను. దాంతో ఆ పిల్లే నన్ను చేసుకోనని చెప్పేసిందిట వాళ్ళ నాన్నతో!"

"ఏం ప్రశ్న వేశారు?"

"నూతన ఆర్థిక విధానం గురించి మీ అభిప్రాయం ఏమిటని అడిగాను నన్ను పిచ్చాడిని చూసినట్లు చూసింది. పేపర్లు చదవదట. ఘరానా మొగుడు లాంటి సినిమాలు నాలుగేసి సార్లు చూస్తుందట."

సునంద నవ్వు ఆపుకోలేకపోయింది. బాగా నవ్వి ఆగి, "నిజంగా - మీత నహా మగవాళ్ళంటే నాకెంత కోపంగా ఉందో - ఐ హేట్ మెన్' అంది.

"అదేంటి ఇప్పుడిందులో ద్వేషించటానికేముంది? హాయిగా నవ్వావు."

"నీ కర్థం కాదు. నాకు నిజంగా కోపంగా ఉంది. చాలా డిస్టర్బ్ చేశావు పద పోదాం" అని అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

చివరకు నరేంద్రను ఒక సంబంధానికి ఒప్పించటంలో శాంతమ్మ మాధవరావులు విజయం సాధించారు. అమ్మాయి డిగ్రీ చదివింది ఉద్యోగం దొరికితే చెయ్యటానికి అభ్యంతరం లేదు. ఇద్దరన్నయ్యలు ఒక అక్క ఉన్నారు. వాళ్ళకు పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఈమె చిన్నది. ఈ పిల్ల పెళ్ళి చేస్తే బాధ్యత తీరిపోతుందని తల్లీ తండ్రీ చూస్తున్నారు. ఇవనీ మధ్యవర్తులు చెప్పిన మాటలు.

నరేంద్ర ముందు ఫోటో చూశాడు. ఇంటిల్లిపాదీ వెళ్ళి సంధ్యను చూశారు.

ఏ వంక పెట్టాలో నరేంద్రకు అర్థం కాలేదు. ఎందుకు వద్దనాలో, ఎందుక ఔననాలో అర్థం కాని అయోమయం.

అసలిప్పుడు పెళ్ళి చేసుకోకపోతే ఏం?

కానీ, ఎప్పుడైనా ఇంతకంటే వేరే విధంగా పెళ్ళి చేసుకోగలడా? ఇంట్ల పోరు ఎక్కువవుతోంది.

చివరకు నరేంద్ర ఒప్పుకున్నాడు.

ముహూర్తాలు పెట్టుకున్నారు. నరేంద్ర రిజిస్టరు పెళ్ళి అన్నాడు గానీ అమ్మాయి వాళ్ళు బొత్తిగా ఇష్టపడలేదు.

"పాపం, వాళ్ళ నమ్మకాలు వాళ్ళవి. వాటిని మనం కాదని ఎట్లా అంటాం మనకు నమ్మకాలు లేవని వాళ్ళనిప్పుడు హఠాత్తుగా మారమనటం డెమోక్రసీ కాదనుకుంటా " అన్నాడు మాధవరావు, కొడుకు బలహీనత మీద దెబ్బ తీస్తూ.

"నాకూ్కడా నువ్వు పీటల మీద కూచుంటే చూడాలని ఉందిరా. మనింట్ల ఇదే మొదటి పెళ్ళి. నా కోసం ఒప్పుకోరా." శాంతమ్మ బతిమాలింది.

నరేంద్ర తల వంచాడు.

"ఎప్పుడూ అంతే. మూర్ఖత్వానికున్న బలం మంచి విషయాల కుండదు. మూర్ఖులు మంచి భావాలున్న వాళ్ళను లొంగదీసుకోగలుగుతారు గానీ, మంచి భావాలున్నవాళ్ళు మూర్ఖులను జయించలేరు. మీ బలహీనత మంచితనం అవుతుంది. మీకా పేరుపెట్టి జీవితాంతం మూర్ఖులు వాళ్ళ ఆటలు వాళ్ళు ఆడతారు."

సునంద మాటలు అశాంతిని రేకెత్తించాయి గానీ చేసేది లేదు. పెళ్ళింకా నెలరోజులుంది.

నరేంద్రకు చాలా ఆందోళనగా ఉంది. ముక్కూ ముఖం తెలియని అమ్మాయితో ఎలా మొదలెట్టాలి జీవితం?

ఒక సాయంత్రం సంధ్యా వాళ్ళింటికి వెళ్ళాడు. వాకిట్లోనే వాళ్ళన్నయ్య ఎదురొచ్చాడు. పలకరింపులు, మర్యాదలు, కాఫీ ఫలహారాలూ అన్నీ సాగిపోతున్నాయి. సంధ్య మాత్రం కనిపించలేదు.

"సంధ్యతో మాట్లాడదామని వచ్చానండీ."

చివరకు నోరు తెరచి చెప్పేశాడు.

వాళ్ళన్నయ్య బిత్తరపోయాడు. లోపలికి వెళ్ళాడు. వాళ్ళ అమ్మా నాన్నలతో సంప్రతింపులు జరిపాడు.

నరేంద్ర అవమానంతో, సిగ్గుతో కూచున్నాడు.

అరగంట తర్వాత సంధ్య వచ్చింది.

వాళ్ళు కూచున్న హాల్లోనే ఓ మూల వాళ్ళ నాన్న కూచున్నాడు. అందరూ కుతూహలంగా పక్క గదుల్లో నుంచి చూస్తున్నారు. ఆ వాతావరణంలో మాట్లాడటం కుదరదని -

"మనం కాసేపు బైటికెళ్ళి వద్దామా?" అని అడిగాడు.

సంధ్య "వద్దులెండి" అంది.

"ఏం?"

"మా వాళ్ళు ఒప్పుకోరు. బాగుండదు."

"వాళ్ళొప్పుకుంటే మీ కిష్టమేనా?"

"ఏమో - నాకు భయం. ఎందుకు లెండి. పెళ్ళి దగ్గర పడిందిగా!"

ఆ మాటలు ఏదోలా ధ్వనించి నరేంద్ర మనసంతా చికాకైంది.

"సరే - నేను వెళ్తాను" అని లేచాడు.

సంధ్య "ఉండండి" అని లోపలికి వెళ్ళి వాళ్ళ అన్నయ్యతో ఏదో చెప్పింది.

ఆయన నరేంద్ర దగ్గరకొచ్చి -

"మీరేం అనుకోకండి. మాది చాలా సాంప్రదాయికమైన కుటుంబం. పెళ్ళికి ముందిలాంటివి మా నాన్న గారికి ఇష్టం ఉండదు. ఆ మూడు ముళ్ళూ పడితే పిల్ల మీ సొత్తే గదా."

నరేంద్ర ముఖం ఎర్రగా చేసుకుని బయటికొచ్చాడు. మర్నాడు సునందతో ఈ విషయం చెబితే, "వాళ్ళదే కరెక్టు. ఆ అమ్మాయిని మీరు మళ్ళీ నూతన ఆర్థిక విధానం అని ప్రశ్నించి చిక్కులో పడేస్తే! పెళ్ళి చేసుకోను పొమ్మంటే! ఎవరి జాగ్రత్తలో వాళ్ళుండాలి. ఏ ఆటకైనా కొన్ని రూల్సుంటాయి. విధినియమాలూ, నిషేధాలూ ఉంటాయి. వాటిని పాటించాల్సిందే. లేదంటే అసలు ఆటే మొదలెట్ట కూడదు" అని అల్లరిగా నవ్వింది.

'ఈ సునంద తన మీద పగబట్టింది. తన బాధ చూసి నవ్వుతోంది. ఎలాగైనా తను తన సంసారాన్ని సుఖవంతం చేసుకుని సునందని చూసి నవ్వాలి' అనుకున్నాడు కసిగా.

కానీ, లోపలెక్కడో సునందే కరెక్టు అని తెలుస్తోంది. సునంద చెప్పేవన్నీ కరెక్టే. అవి కరెక్టని తనకు తెలుసు గాబట్టే సునందను పెళ్ళాడాలనుకున్నాడు. ఆ ఒక్కదానికీ అంగీకరిస్తే ఇద్దరం ఎంత సుఖపడేవాళ్ళం - అని నిట్టూర్చాడు.

పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళికి సునంద రాలేదు.

"ఆ వేషంలో మిమ్మల్ని చూడలేను. సారీ" అని ముందే చెప్పేసింది.

నరేంద్రకు ఎంత దుర్భరంగా ఉన్నా పెళ్ళి శాస్త్రోక్తంగా జరిగింది. నరేంద్ర, సంధ్య సమాజం సాక్షిగా భార్యాభర్తలయ్యారు.

'సంధ్యను ప్రేమించాలి' గట్టిగా నిర్ణయించుకున్నాడు నరేంద్ర.

* * *

పెళ్ళయిన పది రోజులకు ఆఫీసులో అడుగుపెట్టిన నరేంద్ర కళ్ళు సునంద కోసం వెతికాయి.

సునంద నవ్వుతూ విష్ చేసింది.

"ఎలా ఉన్నారు?" అనడిగాడు ఆమె టేబుల్ దగ్గరకు వెళ్ళి.

"ఆ ప్రశ్న అడగాల్సింది నేను. ఎలా ఉంది కొత్త పెళ్ళికొడుకు పాత్ర?" నవ్వింది సునంద.

"చాలా హాయిగా, సుఖంగా ఉంది."

"గుడ్. జీవితమంతా ఇలాగే సుఖసంతోషాలతో గడిచిపోవాలని మనసారా కోరుకుంటున్నాను."

సునంద మనస్ఫూర్తిగా అభినందించింది.

సునంద తన సంతోషాన్ని చూసి దిగులుపడనందుకూ, ముఖం మాడ్చుకో నందుకూ నరేంద్ర కాస్త అశాంతి పడ్డాడు.

'తనేం కోల్పోయిందో ఈమెకు తెలియదు. ఎక్కడో ఎవరి చేతిలోనో మోస పోతుంది' అనుకున్నాడు జాలిని తెచ్చిపెట్టుకుంటూ.

మరో రెండు రోజులు గడిచాయి.

ఆ రోజు రాత్రి అలవాటుగా సంధ్యను దగ్గరకు తీసుకోబోతే, ఆమె దూరం జరిగింది.

"ఏంటి సంధ్యా" అంటే ఏడవటం మొదలుపెట్టింది.

నరేంద్ర చాలా కంగారు పడ్డాడు. ఏమిటి, ఏమయిందని బుజ్జగించి అడిగాడు.

"మనం ఎప్పటికీ ఈ ఇంట్లో ఉండాల్సిందేనా?" అందామె.

"అంటే?"

"మనిద్దరం వేరే వెళ్ళిపోదాం. నేనిక్కడ ఉండలేను."

"అదేంటి? ఎందుకు? ఇప్పుడేమయింది?"

"మీ అమ్మ సాధింపులు న్నేను భరించలేను. మీ చెల్లెళ్ళు పట్టి కూబి ముండలు."

నరేంద్ర ఉలిక్కిపడ్డాడు. సంధ్య నోటి నుంచి వచ్చిన ఆ మాటకు అసహ్యంతో ఒళ్ళు జలదరించి, అప్రయత్నంగా సంధ్యను వదిలి దూరం జరిగాడు.

"అసలు మీ వాళ్ళ స్వరూపం పెళ్ళిలోనే తెలిసింది. మేం వంద కొబ్బరి చిప్పలు పంపితే, మీ వాళ్ళు యాభయ్యే పంపారు. అప్పుడే మా అమ్మ అంది. ఇంత లేకి మనుషులతో నువ్వెట్లా వేగుతావో అని."

నరేంద్రకు ఆ మాటలు అర్థం కాలేదు ఎంత ప్రయత్నించినా.

"కొబ్బరి చిప్పలేంటి?" అన్నాడు పాలిపోయిన ముఖంతో.

యార్నాల పెట్టెలు, వాటిలో పంపే సామాన్లు, ఆడ, మగ పెళ్ళివారు ఒకరికి తీసిపోకుండా ఒకరు అందులో పంపాల్సిన వస్తువుల లిస్టూ - అన్నీ వివరించింది సంధ్య.

"అయితే, ఏమిటంటావు?"

"ఏమనేదేంటి? మీ అమ్మగారి గడుసుతనం."

"ఐతే ఆ కొబ్బరి చిప్పల కోసం మనం వేరే వెళ్ళిపోవాలా?"

"కొబ్బరి చిప్పల కోసం కాదు. బోడి చిప్పలు వెయ్యి పంచగలం. మీరిచ్చిన యాభై ఏ మూల కొచ్చాయి?"

"మరేంటి నీ గోల." అరిచాడు నరేంద్ర.

"మీ అమ్మతో, చెల్లెళ్ళతో నేను పడలేను. మనం వేరే వెళ్ళిపోదాం."

"వాళ్ళేం చేశారో చెప్పు."

"నేనే పని చేసినా వంకలు పెడతారు. ఏ పనీ చెయ్యకుండా కూచుంటే కళ్ళలో కారం పోసుకుంటారు. నిన్నేం జరిగిందో మీకు తెలియదు." ఏడవటం మొదలెట్టింది.

"ఏడవకు - ఏడిస్తే, నాకు చాలా చిరాకొస్తుంది. నేను రేపు మాట్లాడతాలే మా అమ్మతో."

"మీరేం మాట్లాడద్దు - అన్నీ నేను చెప్పానని ఇక సాధిస్తారు."

"ఏం మాట్లాడకుండా ఎట్లా?"

"మేం వేరే వెళ్ళిపోతామని చెప్పేయండి."

"ఎందుకని అడిగితే."

"ఎవరి సంసారం వాళ్ళు చూసుకుంటేనే మంచిది. వేరుగా ఉంటేనే ప్రేమలు నిలుస్తాయని చెప్పండి."

"అలా చెప్పేస్తే అయిపోతుందా? వాళ్ళు బాధ పడరా?"

"నా బాధ మీకు పట్టదా? నన్ను బాధ పెడతారా?"

మళ్ళీ సంధ్య కళ్ళ నుంచి నీళ్ళు.

నరేంద్రకు హఠాత్తుగా ఈతరాని పిల్లాణ్ణి నీళ్ళలో పడేసినట్లనిపించింది.

"ఆలోచిస్తాలే, పడుకో" అన్నాడు చేసేది లేక.

"ఆలోచన లేదు, ఏం లేదు. వేరే ఇల్లు చూడండి. రేపు నేను మా ఇంటికెళ్ళి మా అన్నయ్యతో కూడా చెప్పి వస్తాలెండి. అసలు మా వాళ్ళిచ్చిన సామాను తెస్తే పెట్టుకోటానికి ఇంట్లో చోటు కూడా లేదు."

సంధ్య సమస్య తీరిపోయినట్లు పడుకుని నిద్రపోయింది.

నరేంద్ర రాత్రంతా జాగారమే చేశాడు. అతనికేమీ పాలుపోలేదు.

పెళ్ళయి మూడు నెలలు గడిచాయో లేదో వేరే వెళ్ళిపోతామని ఎట్లా చెప్పటం?

అమ్మ సతాయిస్తోందా సంధ్యని. పనజ, గిరిజల్ని గురించి ఎంత తేలిగ్గా మాట్లాడింది.

**సంధ్య సమస్య తీరిపోయినట్లు పడుకుని నిద్రపోయింది. నరేంద్ర రాత్రంతా జాగారమే చేశాడు. అతని కేం పాలుపోలేదు.**

ఈ సంధ్య గురించి తనకేమీ తెలియదు. ఎన్ని కొత్త విషయాలు తెలుస్తాయో?

తెల్లవారాక తల్లి ముఖం చూడటానికి నరేంద్రకు చాలా సిగ్గేసింది. తల్లి గురించి చెడ్డగా వినటం అతనికిదే మొదటిసారి. చెల్లెళ్ళ గురించి కూడా. వాళ్ళు ఆడబిడ్డల్లా తయారయ్యారా అని బాధపడ్డాడు.

ఇప్పుడు ఎవరితోనైనా ఎలా మాట్లాడాలి?

సంధ్య ఎదురుగా వాళ్ళతో ఏం మాట్లాడగలడు? వాళ్ళలో వాళ్ళకి అభిప్రాయ భేదాలొస్తే తనెట్లా పరిష్కరిస్తాడు. ఈ బాధ్యత తనకెందుకు?

ఆలోచించినకొద్దీ నరేంద్రకు భయం పట్టుకుంది. సునందతో చెబితే ఏమంటుందో?

ఆడవాళ్ళకు ఆడవాళ్ళే శత్రువులనే విషయం చర్చకు పెట్టాడు. "అత్తా కోడళ్ళు పోట్లాడుకుని మగాడి మీద పడితే, వాడేం చేస్తాడండీ" అన్నాడు గట్టిగా దబాయిస్తూ.

సునంద దానికి పూర్తి బాధ్యత మగాడిదేనని తీర్పు ఇచ్చేసింది.

"ఇద్దరు భిన్న స్వభావాలు కలిగిన, వయసు తేడాలతో ఉన్న ఆడవాళ్ళు హఠాత్తుగా ఒకచోట సహజీవనం చెయ్యాల్సిన పరిస్థితి మగాడివల్లే వస్తుంది. ఇద్దరూ ఆ మగాడే తమకు ఆధారం అన్నట్లు చూస్తారు. సమాజం వాళ్ళకదే నూరిపోస్తుంది. ఆ మగాడికి ఇద్దరు ఆడవాళ్ళు తన మీద ప్రాణాలు పెట్టుకుని తనకోసం కొట్టుకుంటుంటే బాగుంటుంది. అతని అహం తృప్తి పడుతుంది. అందువల్ల కాస్త చికాకైనా భరించి అత్తాకోడళ్ళ మధ్య నిప్పు రాజేస్తుంటాడు. దీనికి పూర్తి బాధ్యత మగవాళ్ళదే. లేదా వాళ్ళు లాభపడుతున్న ఈ వివాహ వ్యవస్థది."

నరేంద్ర మరింత భారంతో కుంగిపోయాడు.

నిజమే. తనను పెళ్ళాడటం వల్లనేగా సంధ్య తన ఇంటికి వచ్చింది.

తను వాళ్ళింటికి కాపురానికి వెళ్ళడు కాబట్టి, వాళ్ళ వాళ్ళతో గొడవలు రావు. ఆమె ఎక్కడో ఎలాగో పెరిగి వచ్చి తనవాళ్ళతో ఎడ్జస్టు కావాలంటే కష్టమే.

ఆమెతో అమ్మకూ, చెల్లెళ్ళకూ కూడా కష్టమే.

సంధ్య చెప్పినట్లు వేరు కాపురం పెట్టడమే ఉత్తమం అనుకున్నాడు.

కానీ, అది ఆచరణలో పెట్టడం ఎంత కష్టమో అతనికి క్రమంగా తెలిసివచ్చింది.

సంధ్య వెంటనే తేల్చమంటుంది. నరేంద్ర మరో రెండు నెలలు టైము అడిగాడు. చాలాసేపు ఏడ్చి, సాధించి ఒప్పుకుంది.

నరేంద్రకు ఈ క్రమంలో అతనికి తెలియకుండానే సంధ్య మీద గౌరవం పోయింది.

నరేంద్రను తన దోవకు తెచ్చుకోవాలన్న ఆరాటంలో సంధ్య తనేం పోగొట్టుకుందో గమనించలేదు. అసలా స్పృహే ఆమెకు లేదు. ఆమెకు పెళ్ళి అయినప్పటినుంచీ అత్తవారింటితో శత్రుత్వం, భర్తను తన మాట వినేలా చేసుకోవటం ఇవి ప్రథమ కర్తవ్యాలని తల్లి, వదినలు, అన్నలు అంతా చెప్పారు.

ఆమె కూడా తను సుఖపడాలంటే అదే మార్గమని గట్టిగా నమ్మింది. లక్షలమంది స్త్రీల లాగానే పెళ్ళంటే ఆమె తన జీవనాధారం అనుకుంది. అక్కడ తను పోటీ లేకుండా, తన భద్రతకు ముప్పు లేకుండా చేసుకోవటమే వివాహ జీవితంలో మొదటి బాధ్యతలనీ, పిల్లల్ని కని పెంచటం తర్వాత బాధ్యతలనీ, ఈ రెండూ నెరవేర్చగలిగితే తన జీవితానికి ఢోకా లేదనీ నమ్మింది.

నరేంద్ర ఒక ప్రత్యేకమైన మనిషనీ, అతనితో సహజీవనం ఆనందప్రదంగా చేయటానికి కొంత ప్రయత్నం అవసరమనీ, ఆ ప్రయత్నమే వివాహ జీవితంలో ముఖ్యమనీ ఆమె అనుకోలేదు.

నరేంద్ర అనేముంది, సంబంధం ఎవరితో కుదిరితే వాళ్ళతో సంసారం సాగించటానికి ఆమె తన పదిహేడవ ఏట నుంచీ సిద్ధంగా ఉంది. దాని కోసం ట్రైనింగు అయింది. నరేంద్ర ప్రత్యేకత ఆమెకవసరం లేదు.

తన జీవనాధారాన్ని గట్టిగా పట్టుకోవాలి. అది ఆమె ప్రయత్నం.

ఆ పట్టు నుంచి తప్పించుకోటానికి మగవాడు ప్రయత్నిస్తుంటాడు.

ఆ ఇద్దరి పోరాటానికీ సంసారమని పేరు.

నరేంద్ర సంసారం అలాగే మొదలయింది.

నరేంద్ర అడిగిన రెండు నెలల గడువు ముగుస్తుండగానే ముప్పు ముంచుకొచ్చింది.

ఒక కుటుంబం రెండవటానికి గడ్డిపోచ కూడా కారణం కావచ్చంటే, కుటుంబ వ్యవస్థ పట్ల భక్తిప్రపత్తులున్న వాళ్ళకు కోపం వస్తుందేమో కానీ, జరిగిందదే.

ఆ రోజు ఉదయం తొమ్మిదిన్నర గంటలకు నరేంద్ర, మాధవరావు భోజనం చేస్తున్నారు, ఆఫీసుకెళ్ళే హడావిడిలో.

నరేంద్రను తన దోవకు తెచ్చుకోవాలన్న ఆరాటంలో
సంధ్య తనేం పోగొట్టుకుందో గమనించలేదు.

మాధవరావు పళ్ళెంలో పడిన కాకరకాయ కూర అన్నంలో కలుపుకుని ఓ ముద్ద నోట్లో పెట్టుకుని, "ముక్క అసలు ఉడకలేదే - ఇదేం కూర" అంటూ కలుపుకున్న అన్నం పక్కకు నెట్టేశాడు.

"అందరూ నాలా ఓపిగ్గా పొయ్యి దగ్గర కూచుని చేస్తారనుకుంటున్నారేమిటి, ఈ కాలం పిల్లలకు అంత ఓపికెక్కడిది? అదేమంటే ఉడికీ ఉడకని కూరలే ఆరోగ్యం అంటారు" అంది శాంతమ్మ, శాంతంగా నవ్వుతూనే.

ఇంతలో సంధ్య దూసుకుని వచ్చింది.

"ఏంటండీ మీ ఎత్తిపొడుపులు? నాకు అలవాటైన పద్ధతిలో చేశాను. చేస్తాను. మీకు నయించకపోతే మీరే చేసుకోవాలి."

"నేను చేసుకోకపోతే ఎవరు చేస్తారు తల్లీ. ఇవాళేగా నువ్వు కూర వండింది"

"అంటే నేను తిని కూచుంటున్నా గాని ఏ పనీ చేయటం లేదనేగా మీ ఉద్దేశం. తిని కూచుంటుంది మీ కూతుళ్ళు. నేను కాదు. అసలు ఇంటిల్లిపాదికీ ఇంత చాకిరీ చెయ్యాలని తెలిస్తే మా అమ్మా వాళ్ళు నాకీ సంబంధం చచ్చినా చేసేవాళ్ళే కాదు. చిన్నపిల్లనని అందరూ గారాబంగా పెంచి చివరికి గోతిలో తోశారు. ఎంత చేసినా మెప్పు లేదు, వంకలు పెట్టడం తప్ప. నా పనికి వంకలు పెట్టడం కాదు, మీ కూతుళ్ళకి నేర్పుకోండి పని. ఇవాళ పోతుల్లా పెంచితే రేపు అనుభవించేది వాళ్ళే. నా ఉసురు ఊరికే పోదు."

వడగళ్ళ వానలా కురుస్తున్న శబ్దాల్ని గుటకవ్వగించి వినటం తప్ప ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

శాంతమ్మ గదిలోకి పోయి మంచం మీద పడుకుని ఏడుస్తోంది.

వనజ, గిరిజ బిక్కమొహాలేసుకుని కూర్చున్నారు.

మాధవరావు గబగబా రెండు ముద్దలు తిని బయటపడ్డాడు.

నరేంద్ర కోపంతో రగిలిపోతూ కూచున్నాడు. ఒక అరగంట గడిచాక సంధ్య వచ్చి మామూలుగా ఏం జరగనట్టు -

"ఆఫీసుకు టైమవుతుంటే అలా కూర్చున్నారేం? వెళ్ళరా?" అనడిగితే నరేంద్రకు జరిగినదంతా నిజమేనా అని అనుమానం వచ్చింది.

తల్లి కోసం చూస్తే ఆమె పడుకుని ఉంది. లేచి తల్లి దగ్గరకు వెళ్ళాడు.

"అమ్మా" అని పిలిచేసరికి శాంతమ్మ ఏడుపు మరింత ఎక్కువ చేసింది.

నరేంద్రకూ దుఃఖం వచ్చింది. తల్లి ఇంతగా ఏడవటం అతనెప్పుడూ చూడలేదు.

"ఏడవకమ్మా, అదేదో తెలియక అందిలే."

సంధ్యను 'అది' అంటున్నానన్న స్పృహ నరేంద్రకు లేదు.

"తెలియక కాదులే. తెలిసి కావాలనే అంది. ఎట్లాగైనా నిన్ను మా నుంచి విడదీసి వేరు కాపురం పెట్టించాలని దీని ఎత్తు. మనం గోతిలో పడ్డాం నాయనా - దిక్కుమాలిన సంబంధం దొరికింది. నీ చెల్లెళ్ళను చూసి నిప్పులు పోసుకుంటుంది."

"పోనీ మేం వేరే వెళ్ళిపోతాంలే అమ్మా."

"అయ్యో! నువ్వు వెళ్ళిపోతే మేం ఏం కావాలిరా - పెళ్ళి చేసుకుని చిలకాగోరింకల్లా మా కళ్ళ ముందు కాపురం చేస్తారనుకుంటే..." శాంతమ్మ ఏడుస్తోంది.

"చిలకా గోరింకలు - కళ్ళ ముందు కాపురం...."

నరేంద్ర పేలవంగా నవ్వుకున్నాడు.

ఈ మాటలకు ఎంత శక్తి ఉందో. ఎందరికి ఎన్ని ఆశల్నీ కలల్నీ కలిగిస్తాయో. అందరూ ఈ మాటల్ని ఎలా నమ్ముకుంటారో. అచ్చం అలాగే బతుకుతామని అనుకుంటారు. కొడుకులూ, కోడళ్ళూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ చిలకా గోరింకల్లా ఉంటారని నమ్మి పెళ్ళి చేస్తారు తలిదండ్రులంతా. తాము చిలకా గోరింకల్లా ఉంటామనుకుని పెళ్ళాడబోయేవారు నమ్ముతారు. ఆ పదం చుట్టూ ఎన్ని ఊహలు - ఎంత మాయాజాలం. ఆ పదం కొన్ని కోట్ల మందికి మంత్రం వేస్తుంది. ఆ పదం సాయంతో దూకేస్తారు, దూకిస్తారు అగ్ని గుండాల్లోకి. ఆ తర్వాత ఆ చిలకా గోరింకలు పిల్లీ ఎలుకలుగా మారిపోతాయి అట్లా మారుతున్నామనే కనీస స్పృహ లేకుండానే.

నరేంద్ర బయటికి వచ్చాడుగానీ, ఆఫీసుకు వెళ్ళ బుద్ధి కాలేదు. ఏం చేయాలో తోచలేదు. ఏదో కనపడ్డ బస్సెక్కి రెండు గంటలసేపు ఊరంతా తిరిగి, మళ్ళీ ఇంటికి వచ్చాడు.

ఇల్లంతా నిశబ్దంగా ఉంది.

చెల్లెళ్ళు బయటికి వెళ్ళినట్లున్నారు. తలుపులు దగ్గరగా వేసున్నాయి.

నరేంద్ర లోపలికి వచ్చాడు. హాల్లోంచి తన గదిలోకి వెళ్తూ తల్లి గదిలోకి తొంగి చూశాడు.

శాంతమ్మ కత్తెర పుచ్చుకుని ఎర్రరంగు గుడ్డ ఏదో కత్తిరిస్తోంది దీక్షగా.



నరేంద్ర తల్లి ఇంకా ఏడుస్తూనే ఉంటుందని భయపడుతూ వచ్చాడేమో, ఆమె లేచి తన కుట్టువని తాను చూసుకోవటంతో కాస్త భారం దిగినట్లయి తన గదిలోకి వెళ్ళాడు.

సంధ్య నిద్రపోతోంది. నరేంద్ర కూడా అలసిపోయి ఉన్నాడేమో, పడుకోగానే గాఢ నిద్ర పట్టింది.

సాయంత్రం ఐదవుతుండగా పెద్ద పెద్ద కేకలతో నరేంద్రకు మెలకువ వచ్చింది. కంగారుగా హాల్లోకి వచ్చాడు.

శాంతమ్మ, సంధ్య, గిరిజ గట్టిగా అరుచుకుంటున్నారు.

"ఏంటి? ఏమయింది?" అందరి గొంతుల్నీ మించిన కేకొకటి వేశాడు.

అందరూ నిశ్శబ్దమైపోయారు. శాంతమ్మ ఎర్ర ఓణీ తీసి రెండంచులు పట్టుకుంది. మధ్యలో పెద్ద చిల్లి, కత్తిరించినట్లు.

"చూడరా! గిరిజ కొత్త ఓణీ. నీ పెళ్ళాం కుళ్ళుమోత్తనంతో ఏం చేసిం చూడు."

"నేను కత్తిరించలేదని లక్ష సార్లు చెప్పాను. మరొక్కసారి ఆ మాటం వళ్ళు రాలిపోతాయ్. మీరే ఎవరో కత్తిరించుకుని నా మీదకు తోస్తారా?"

నరేంద్ర తల గిర్రున తిరిగిపోయింది.

మధ్యాహ్నం ఈ ఓణీనే తల్లి కత్తిరిస్తుంటే, తన కళ్ళతో తను చూశాడు. ఏ కుట్టు పనిలో ఉందిలే అనుకున్నాడు.

అమ్మ - అమ్మ - అమ్మ ఇంత పని ఎట్లా చేసింది!

అమ్మ కూడా ఇంతేనా? ఎందుకిట్లా చేసింది? ఇప్పుడు తనేం చెయ్యాలి? అసలు విషయం చెబితే అమ్మ ఏమవుతుంది? చెప్పకపోతే సంధ్య సంగతేమిటి? ఏం చెయ్యాలి? సంధ్య ఏడుస్తోంది.

"దొంగముండలు, నా మీద ఇంత నింద వేస్తారా? అట్లాంటి ఓణీలు వంద కట్టి అవతల పారేశాను. నాకేం పని ఈ ముండమోపి ఓణీలతో."

"సంధ్యా - రా." సంధ్య చెయ్యి పట్టి లోపలకు తీసికెళ్ళాడు.

"సంధ్యా, నువ్వన్నదే రైటు. నేను వేరే ఇల్లు చూస్తాను. అప్పటిదాకా నువ్వు మీ ఇంటికి వెళ్తావా?"

"నేనెందుకు వెళ్తాను? నేనే తప్పూ చెయ్యలేదు. దొంగ పారిపోయినట్లు పారిపోయే కర్మ నాకెందుకు? మీరు ఇల్లు చూశాక మనింటికి మనం రాజాలా వెళ్ళిపోదాం."

సంధ్య విజయగర్వంతో అందరికీ వినపడేలా అంది.

నరేంద్ర చెప్పిందంతా మౌనంగా విన్న సునంద కళ్ళలో కూడా నీళ్ళు.

"ఆడవాళ్ళు సంసారంలో ఇలాగే మొద్దుబారి వికృతంగా తయారవుతారు నరేంద్రా. అది ఒక్కో దశలో ఒక్కోరకంగా మొదలవుతుంది. మీ అమ్మ ఇప్పటివరకూ మొద్దుబారలేదంటే ఆమెకు అనుకూల పరిస్థితులే ఉండి ఉంటాయి. ఆమెకు అత్తగారు ఉండి ఉండరు."

"ఔను - మా నాయనమ్మ మా నాన్న పెళ్ళి కాకముందే చనిపోయింది."

"ఆడబిడ్డలు - మరుదులు..."

"లేరు."

"ఆర్థిక పరిస్థితీ మంచిదే - అందుకే అమ్మ బాగుంది."

"ఇవాళ ఆమె అధికారానికి ఒక కుదుపు వచ్చింది. దాన్ని రక్షించుకోవటానికి ఆమె రంగంలోకి దిగింది. ఇక మానవత్వం మరిచిపోయింది. మనిషిననీ, ఆడదాన్ననీ మరిచిపోతుంది. అత్తగా మారిపోతుంది. ఆడవాళ్ళిలా సంసారంలో పడి మనుమలుగా కాకుండా పోయే స్థితి ఉందే - ఇది భయంకరం. నాకు

> **"ఆడవాళ్ళిలా సంసారంలోపడి మనుమలుగా కాకుండా పోయే స్థితి ఉందే - ఇది భయంకరం" అన్నది సునంద.**

ఆడవాళ్ళను తలుచుకుంటే దుఃఖం. ఎలాగైనా వాళ్ళను బయటికి లాక్కు రావాలనిపిస్తుంది. మీరు ఆ మూసలో పడిపోకండి అని చెప్పాలనిపిస్తుంది. నరేంద్రా, మీ అమ్మ నెలాగైనా రక్షించు. మీ అమ్మని అమ్మగా మిగుల్చుకో."

"నేనేం చెయ్యను? వేరే వెళ్తానని చెప్పాను. కానీ, సంధ్య కూడా తక్కువ కాదుగా. సంధ్యను చూస్తుంటే నాకు భయంగా ఉంది."

"ప్లీజ్. నాకింక చెప్పకు నరేంద్రా. ఈ పెళ్ళిళ్ళూ, దాని ఫలితాలూ నాకు బాగా తెలును. నాకా ఇద్దరు ఆడవాళ్ళను తల్చుకుంటే బోలెడు దిగులుగా ఉంది."

"వాళ్ళ మీదేనా? నామీదేం దిగులు లేదా? నేనెలా నలిగిపోతున్నానో పట్టించుకోవేం?"

"నీ గురించి దిగులు పడటం ఎందుకు? నీ జీవితానికి నువ్వే బాధ్యుడివి. ఓ ఏడాదిలో నువ్వు ఈ దిగుళ్ళ నుంచి బయట పడిపోతావు. నీకు బయట ప్రపంచం ఉంది. అక్కడ నీ ఇష్టం వచ్చినట్లు పనులు చేస్తావు. డబ్బూ, కెరియరూ, రాజకీయాలు, స్నేహాలూ, సభలు, సమావేశాలూ, క్లబ్బులూ, తాగుళ్ళూ, సమస్త వ్యసనాలూ నీ కోసం సిద్ధంగా ఉంటాయి. ఎంచుకోవటమే నీ సమస్య. ఎంచుకునే అవకాశం ఉంది. కానీ, ఆ ఇద్దరు ఆడవాళ్ళు - నీమీద - నీ ఒక్కడి మీద - ఇంత నిస్సహాయుడివీ, ఇంత తెలివితక్కువ వాడివీ, ఇంత బలహీనుడివీ, పిరికివాడివీ అయిన నీ ఒక్కడి మీద - అధికారం కోసం తమ జీవితమంతా ఖర్చు చేస్తారు. ఒక్కోసారి ఆ అధికారం కోసం చచ్చిపోతారు. నీ పిల్లల్ని కని పెంచటంలో నీ భార్య మరింత మొరటు తేలుతుంది. ఆమెను నువ్వేలా రక్షించగలవు? నిన్ను నువ్వే రక్షించుకోలేని వాడివి. ఇంతే - ఈ సమాజం ఎంత క్రూరమైందంటే, ఎంత కఠిన మైందంటే, ఆడవాళ్ళను పనిగట్టుకుని తయారు చేస్తుంది. బలి కోసం ముస్తాబు చేస్తుంది. చివరికి హత్య చేస్తుంది. ఆ ఆడవాళ్ళను తల్చుకుంటే నాకు జాలి -"

నరేంద్ర నిస్సహాయంగా, కోపంగా చూశాడు సునంద వంక.

ఈ సునంద తనకెప్పుడూ అర్థం కాదు. ఈమె దగ్గర ఓదార్పు దొరుకుతుందను కోవటం తన తెలివితక్కువతనం.

నరేంద్ర హతాశుడయ్యాడు.

అర్జెంటుగా ఇల్లు చూడాలి. ఈ మాటలు విన్న తల్లి హాల్లో కూలబడి పెద్దగా శోకాలు పెడుతోంది.

నరేంద్ర మళ్ళీ ఇంట్లోంచి బయటపడ్డాడు.

సునంద దగ్గరకు వెళ్ళి మాట్లాడాలనిపించింది. ఆమెతో ఇవన్నీ చెప్పు కుంటే సలహా ఇస్తుంది.

ఇక నిలువరించుకోలేకపోయాడు. సునందతో సంబంధం తెంచుకున్న పది నెలలకు మళ్ళీ సునంద ఇంటి ముందు నిలబడ్డాడు.

మొదటిసారి సునంద ఇంటికి వెళ్ళి తలుపు కొట్టకుండా వెనక్కు వచ్చిన రోజు -

తర్వాత కాస్త సంభ్రమంగా తలుపు కొట్టిన మొదటి రోజు -

ఆ తర్వాత ప్రేమతో, చనువుతో తలుపు కొట్టిన రోజులు - అన్నీ గుర్తొచ్చాయి.

ఇవాళ పూర్తిగా వేరే రోజు.

సునంద నరేంద్రను చూసి ఆశ్చర్యపోయింది.

"ఒక్కరే వచ్చారా? ఆమెను తీసుకురాలేదా?"

"లేదు. ఇటువైపు పనుండి వస్తూ, మీరున్నారేమోనని ఊరికే -"

సంజాయిషీ ఇస్తున్నట్లు గొణిగాడు.

"ఫరవాలేదు. తప్పు చేసినట్లు అలా చెప్తారేమిటి. మంచినీళ్ళు కావాలా?"

వద్దని కూర్చున్నాడు.

"నాకు చాలా ఇష్టమైన పాట వింటుండగా మీరొచ్చారు. మీరు కూడా పాట విన్న తర్వాత మాట్లాడుకుందాం. మళ్ళీ నా మూడ్ ఎలా ఉంటుందో - ఈ చిన్న కోరిక తీరుతుందో లేదో."

నవ్వుతూ టేప్‌రికార్డర్ ఆన్ చేసింది.

జగజిత్ సింగ్, చిత్రా సింగ్‌లు పాడిన గజల్.

బాల్యాన్ని గురించిన పాట.

ఈ యౌవనాన్నీ ఈ సంపదల్నీ అన్నింటినీ తీసుకో - నా బాల్యాన్ని నాకివ్వు.

ఆ కాగితపు పడవల్నీ ఆ వర్షపు ధారల్నీ నాకివ్వు.

అమ్మమ్మ చెప్పే పెద్ద పెద్ద కథల్లో చిన్నవైపోయే రాత్రిళ్ళు నాకివ్వు. అంటూ పాట వస్తుంటే, నరేంద్ర కళ్ళమ్మట కన్నీరు ఉబికి వచ్చింది.

పాట అవగానే టేప్ కట్టేసి నరేంద్ర వంక చూసిన సునంద ఆశ్చర్యపోయింది.

"మీకూ నచ్చిందా పాట?" సంతోషంగా అడిగింది.

నరేంద్ర తల ఊపి కళ్ళు తుడుచుకున్నాడు.

"ఊఁ చెప్పండి. హఠాత్తుగా ఇలా మా ఇల్లు పావనం చేశారెందుకు? ఏదైనా పని ఉంటే మొహమాటం లేకుండా చెప్పండి. లేదు - ఊరికే వచ్చానన్నా నేనేం అనుకోను. మంచి పాటలు విందాం. ఇవాళ ఆఫీసు ఎగ్గొట్టారేం?"

"సునందా. నాకో ఇల్లు కావాలి. మీకు తెలిసి ఎక్కడైనా ఉంటే."

"ఎందుకూ? మీకేనా?"

"ఊఁ - నేనూ, సంధ్యా వేరే ఇంట్లోకి వెళ్దామని."

"గుడ్. కంగ్రాచ్యులేషన్స్. కొత్త కాపురం." నవ్వింది సునంద.

"నాకు సంతోషంగా లేదు సునందా. కొత్త కాపురం ఇష్టంగా లేదు. తప్పనిసరై పెడుతున్నాను."

నరేంద్ర జరిగిందంతా చెప్పాడు.

"మా అమ్మ ఎందుకలా చేసింది? మా అమ్మ మంచిదే సునందా. పనివాళ్ళను మంచిగా చూస్తుంది. ఎవరో ఒకరికి లేనివాళ్ళకు ఇంత అన్నమో, కూరో పెట్టకుండా తను తినదు. నన్నూ నా చెల్లెళ్ళనూ ఎప్పుడూ కొట్టలేదు. అమ్మ ఇంత అన్యాయంగా ప్రవర్తించిందంటే నా మీద నాకే అసహ్యంగా ఉంది. ఎందుకట్లా చేసింది?"

*    *    *

నరేంద్ర వేరే ఇంటికి మారే రోజు ఈ ఇంట్లో శవం లేచినంత పనయింది.

రెండు రోజుల ముందునుంచే శాంతమ్మ అన్నం తినటం లేదు.

చెల్లెళ్ళు బలవంతంగా కాఫీ, మజ్జిగలు తాగిస్తున్నారు.

నరేంద్ర వెళ్ళి మాట్లాడించబోతే, ఆమె ఏడవటం తప్ప నరేంద్ర ముఖం చూసి మాట్లాడలేదు. చెల్లెళ్ళు కూడా నరేంద్ర మీద కోపంగానే ఉన్నారు. తండ్రి తనకేం పట్టనట్లు కూచున్నాడు.

సంధ్య అది కావాలి, ఇది కావాలి అని అన్నీ సర్దుతోంది.

"మనకు కావాల్సినవి మనం కొనుక్కుందాం లే" అంటే -

"వీటితోనే తెల్లారుతుందా ఏమిటి? మనం కొనుక్కున్నాక వీటిని వీళ్ళ ముఖానే కొట్టి పోతాను. అంతవరకూ జరగొద్దూ."

సంధ్య ఈ బంధం ఎంత తెగిపోతే అంత మంచిదన్నట్లు మాట్లాడుతోంది.

నరేంద్ర వేరు కాపురానికి ఒప్పుకోవటంతో ఆమె గర్వానికీ, సంతోషానికీ మేర లేదు. మొదటి విజయం సాధించినట్లేనుకుంటోంది.

కొత్త ఇంటికి సంధ్య తల్లి, అక్కయ్య, వదినలు, అన్నలు అంతా వచ్చారు. వాళ్ళు తెచ్చిన సామానే బోలెడు ఉంది. అంతా కలసి సామాను సర్దారు. పాలు పొంగించారు. వంటలు చేశారు. ఇల్లు పండుగనాటి ఉత్సాహంతో పొంగిపోతోంది.

తల్లీ, చెల్లెళ్ళూ గుర్తొచ్చి నరేంద్రకు దిగులనిపించింది.

"ఏంటే? మీ ఆయన ముఖం అలా వేలాడేసుకున్నాడు?"

సంధ్య అక్కయ్య ఆరా తీసింది.

"ఆయనకు తల్లీ, చెల్లెళ్ళంటే అమ్మో - మహా తీపి. నేను ఎంత రాపాడితే ఇట్లా రాగలిగామనుకుంటున్నాం. అమ్మో - అక్కడుంటే నన్ను బతకనిచ్చే వారేనా? కాకుల్లా పొడుచుకు తినేవారు కదూ?"

నరేంద్ర వింటే ఏమనుకుంటాడోనన్న భయం కూడా లేకుండా మాట్లాడింది సంధ్య.

అందరూ కలసి సంధ్య తెలివినీ, సామర్థ్యాన్నీ అభినందిస్తున్నారు.

కోడళ్ళను చంపేదీ, చావుకి కారణమవుతున్నదీ అత్తగార్లేనన్న ప్రచారాన్ని పత్రికలు, సినిమాలు పకడ్బందీగా చేస్తుంటే, అత్తగార్ల నుండి తప్పించుకోవటమే కోడళ్ళ జీవితాశయంగా మారిపోతుంటే - సంధ్యలాంటి వాళ్ళను చూసి ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

కానీ, నరేంద్ర, సంధ్యను మామూలు ఆడదానిలాకాక, తన భార్యగా చూసుకుని ఆశ్చర్యపడ్డాడు, ఆగ్రహపడ్డాడు.

సంధ్య తన జీవితాన్ని దుర్భరం చేయటానికి పనిగట్టుకు వచ్చిన రాక్షసి అనే అభిప్రాయం ఆ క్షణానే అతని మనసులో ఏర్పడింది. ఆ తర్వాత ఆ అభిప్రాయాన్ని ప్రతి క్షణం పెంచి పోషించుకునే పరిస్థితులే ఎదురయ్యాయి.

మరో ఆరు నెలలు గడిచాయి. నరేంద్రకు తలిదండ్రులతో, చెల్లెళ్ళతో మళ్ళీ మాములు సంబంధాలు ఏర్పడ్డాయి. వాళ్ళు నరేంద్ర ఇంటికి వస్తూ పోతూ ఉన్నారు. అంతా సద్దుమణిగినట్లే అనిపించింది.

శాంతమ్మ కోడల్ని నెల తప్పటం గురించి అడిగింది కూడా. సంధ్య సిగ్గు పడుతూ అలాంటి విశేషమేమీ లేదంది.

వాళ్ళ మధ్య అగాధాలు పూడినట్లే ఉన్నాయి.

కానీ, దంపతులిద్దరి మధ్య పెద్ద అగాధం ఏర్పడి రోజు రోజుకీ పెరుగుతోంది.

ఆ అగాధం గురించి సంధ్యకు తెలియను కూడా తెలియదు.

నరేంద్రకు సంధ్యతో ఏ విషయం మాట్లాడబోయినా, అది చివరకు డబ్బు లోకే దారి తీస్తుంది. ఏదో ఒక పని చేసి డబ్బు సంపాదించమని సంధ్య పోరు పెట్టని రోజు లేదు.

వాళ్ళన్నయ్య కొన్న షేర్లు కొనమనీ -

వాళ్ళ నాన్న చెప్పిన స్థలాలు కొనమనీ -

ఏ మాట మాట్లాడు - సినిమాకు వెళ్దామన్నా పాటలు విందామన్నా షికారు వెళ్దామన్నా అన్నింటినీ ఎలాగోలా డబ్బు వైపు లాక్కెళ్తుంది.

నరేంద్రకూ ఆ పిచ్చి ఉంటే ఇద్దరూ సుఖపడేవారేమో.

నరేంద్ర తన ఉద్యోగమే తనకు ఎక్కువ అని అనుకునే స్వభావం గలవాడు.

పైగా, ఈ పెట్టుబడులకు తండ్రి దగ్గర ఆస్తి పంచుకురమ్మని సంధ్య డిమాండు.

తండ్రిని ఆస్తి అడగటం తనవల్ల కాని పని అని సంధ్యకు చెప్పేశాడు.

దాంతో సంధ్య నరేంద్రను పూచికపుల్లలా చూడటం మొదలెట్టింది.

ఆమె తన తండ్రి దగ్గర్నించి రెండు లక్షల రూపాయలు తెచ్చుకుంది.

నరేంద్ర కట్నం వద్దన్నాడు గానీ, సంధ్య తన వాటా తను తెచ్చుకుంది.

ఆ డబ్బులో కొంత పెట్టి షేర్లు కొంది. రెండు నెలల్లో అమ్మితే అది రెట్టింపయిందట.

"తల్లీ కూతుళ్ళిద్దరూ మగాళ్ళను కనపడనివ్వరు. ఒకటే రాపాడుతూ తిరుగుతారు. మిమ్మల్ని వల్లో వేసుకోవాలని గాకపోతే మీ ఆఫీసులో దానికి పనేంటి? ఆ మొగుడుత్తి చేతకాని దద్దమ్మ."

నరేంద్ర సంధ్య చెంప పగిలేలా కొట్టాడు.

"వేరేవాళ్ళ గురించి అట్లా మాట్లాడతావా? ఆడదానివి కావు?" కోపంతో మండిపడ్డాడు.

సంధ్య ఏడ్చింది. ఆ ఏడుపులోనే నరేంద్రకూ, హైమవతికీ సంబంధం ఉన్నదని రూఢి చేసుకున్నది.

లేకపోతే ఎన్నడూ కొట్టని నరేంద్ర, తల్లిని తిట్టినపుడు కూడా కొట్టని నరేంద్ర, హైమవతిని ఒక మాటనగానే కొడతాడా?

నరేంద్రకు నరకం వేరే ఎక్కడా లేదనిపించింది.

అతనికి హఠాత్తుగా సునంద గుర్తొచ్చింది.

ఆడవాళ్ళందరి పట్లా జాలితో కరిగిపోయే సునంద - తన భర్తతో మాట్లాడే ప్రతి ఆడదాన్నీ అవమానించే సంధ్య.

ఇంతలో సునందకు ప్రమోషన్ మీద ట్రాన్స్‌ఫర్ వచ్చింది. అనంతపురం వెళ్ళిపోయింది.

సునంద వెళ్ళిపోయాక మరీ ఒంటరి అయిపోయాడు నరేంద్ర. అతను ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా సునంద మాటలు అతనికి అర్థమయ్యేవి.

తన బాధను ఇంకో కోణం నుంచి చూసినా తనను సునంద అర్థం చేసుకుంటుందనే నమ్మకం ఉండేది. సునంద వెళ్ళాక ఆఫీసులో కూడా మూడీగా ఉంటున్నాడు. క్రమంగా సంధ్య, నరేంద్రల మధ్య యుద్ధాలు మొదలయ్యాయి. అవి ఎంత చిన్న విషయం దగ్గర మొదలైనా చిట్టచివరకు నరేంద్ర చేతకానితనం దగ్గర ఆఖరయ్యేవి. సంధ్య ఫ్లాట్ కొనటానికి కడుతున్న చిట్టీలు రావడానికి ఇంకా చాలా టైముంది.

ఇంతలోనే మంచి ఫ్లాట్ అమ్మకానికి వచ్చింది. లోన్లు తీసుకున్నా ఇంకా లక్షన్నర తగ్గింది.

"మీ నాన్ననడిగి తెండి" అంది సంధ్య, తన మామూలు ధోరణిలో.

"మీ నాన్ననే అడిగి తెచ్చుకో" అన్నాడు నరేంద్ర.

"మా నాన్న ఇవ్వాల్సినవి ఇచ్చాడు. ఇవ్వాల్సింది మీ నాన్నే."

"మా నాన్న అసలేం ఇవ్వనవసరం లేదు. నీకు మా నాన్న కట్నం ఇవ్వాలన్నట్లు మాట్లాడుతావేంటి?"

"నాకేం ఇవ్వనవసరంలా - మీకు ఆస్తిలో హక్కు లేదా?"

"ఉంటే. అది వచ్చినప్పుడు వస్తుంది. నేను నా సంపాదనలో పైసా వాళ్ళకివ్వటం లేదు. వాళ్ళనడగటం ఏమిటి? పైగా, ఇద్దరు చెల్లెళ్ళు పెళ్ళి కున్నారు."

"అదే నేనూ మొత్తుకునేది. ఉన్నదంతా చెల్లెళ్ళకిచ్చి మనకు మొండి చెయ్యి చూపిస్తే? అసలే నేనంటే మీ వాళ్ళకు గిట్టదు." సంధ్య కక్షగా అంది.

"నీకు డబ్బు కావాలి. అంతేగదా - నా ఎల్.ఐ.సి పాలసీ మీద లోను తెస్తాను. పి.యఫ్ లోను తెస్తాను. అప్పు చేస్తాను. ఎలాగోలా తెస్తాను. సరా? మా నాన్నను మాత్రం అడగను."

**సంధ్య తన జీవితాన్ని దుర్భరం చేయటానికి వచ్చిన రాక్షసి అని నరేంద్ర అభిప్రాయం ఏర్పరచుకున్నాడు.**

ఆ డబ్బు పెట్టి సిటీకి దూరంగా నాలుగైదు ప్లాట్లు కొంది.

రెండేళ్ళలో పెద్ద ఫ్లాట్ సిటీలో కొనాలని పెద్ద చిట్టీలు రెండింటిలో చేరింది.

ఆ చిట్టీలకు కట్టడానికి నెల నెలా వడ్డీ వచ్చేలా కొంత డబ్బు వడ్డీలకిచ్చింది.

ఈ పనులన్నింటితో సంధ్య మనసంతా నిండిపోయేది.

నరేంద్రకందులో చోటు లేదు, పనీ లేదు. అక్కడ నరేంద్ర చేతకాని చవట.

నరేంద్ర మానసికంగా చాలా కుంగిపోయాడు. తన ప్రపంచం ఎక్కడ ఏర్పరుచుకోవాలో అతనికి తెలియలేదు.

పైగా సంధ్య అనుమానం మనిషి. నరేంద్ర పక్కింటి పన్నెండేళ్ళ వసంతతో మాట్లాడుతున్నా సంధ్య సహించగలిగేది కాదు. ఒకరోజు వసంతా వాళ్ళమ్మ నరేంద్రతో మాట్లాడాలని వచ్చింది.

ఆమెకు నరేంద్ర పనిచేసే ఆఫీసులో ఏదో పని ఉంది.

నరేంద్ర ఆమె చెప్పేదంతా విని, ఆ పని తను చూస్తానని వివరాలన్నీ కాగితం మీద రాసుకున్నాడు. రాసుకుంటూ -

"సంధ్యా - టీ తీసుకురారాదూ?" అన్నాడు.

సంధ్య విసవిసా లోపలికి వెళ్ళి అదే ఊపులో వచ్చి -

"పాలు లేవు - పిల్లి తాగినట్లుంది" అంది.

"అయ్యో - మా ఫ్రిజ్‌లో ఒక పాకెట్ ఉంది. పంపుతానులెండి" అని హైమవతి వెళ్ళింది.

"బోడిముండ - కూతురికి చేతగావటం లేదని తను వచ్చింది -"

నరేంద్ర ఏమిటన్నట్లు చూశాడు.

"అప్పులు చేసి వడ్డీలు కడుతూ కొంప గుండం చెయ్యండి. ఎల్.ఐ.సిలు, పి.యఫ్‌లు ముట్టుకోవటానికి వీలు లేదు. రేపు మీకేదైనా యాక్సిడెంటయితే నా గతేం కావాలి?"

నరేంద్ర నిలువునా నీరైపోయాడు. పెద్దపెట్టున దుఃఖం వచ్చింది. తను చస్తే వచ్చే డబ్బుల మీద కూడా సంధ్య దృష్టి ఉంది.

ఎందుకు తనకీ నరకం దొరికింది? ఏ పాపం చేశాడు? మగవాళ్ళందరూ ఆడవాళ్ళను పీడిస్తారట. తను మంచిగా ఉంటే తనకీ పీడన ఏంటి? ఎవరో ఒకరు పీడించటమేనా పెళ్ళంటే. తన మంచితనం చేతకానితనం అయి పోతోంది. తను చస్తే వచ్చే డబ్బుల కోసం కూచున్న భార్య కోసం బతకాలా? ఈ బతుక్కి అర్థం ఏమన్నా ఉందా?

నరేంద్ర కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి.


"మగాడిలా డబ్బు తేలేకపోతే పోయారు. ఆడదానిలా ఏడుస్తారెందుకు? మీ చేతగానితనానికి నేనేడవాలిగాని."

నరేంద్ర నిగ్రహించుకోలేక సంధ్యను కొట్టాడు.

సంధ్య మరీ రెచ్చిపోయింది. నరేంద్ర మళ్ళీ కొట్టాడు. కొట్టి కొట్టి చేతులు నొప్పెట్టి ఊరుకున్నాడు.

ఆ పూనకం దిగి, తనను చూసుకుని తను ఏడ్చాడు. భార్యను కొట్టాడు. ఒక ఆడదాన్ని కొట్టాడు. ఎందుకిలా మారిపోయాడు తను? ఎవరు రాక్షసులు ఇద్దరిలో?

సంధ్యను పలకరించబోతే కస్సుమని లేచి ఇష్టం వచ్చినట్లు తిట్టింది.



మర్నాడు పొద్దునే సంధ్య పుట్టింటికి వెళ్ళిపోయింది. నరేంద్ర తండ్రి ఇంటికి చేరాడు.

వారం, పది రోజులు మౌనంగా గడిచాయి.

తర్వాత రాయబారాలకు మధ్యవర్తులు రంగంలోకి దిగారు. ఇరువక్షాల వాళ్ళూ తమ తమ వాదనలు వినిపించారు. తప్పెవరిదైనా ఓర్పుకోక చేసేదే ముందని రెండు పక్షాలకూ సమానంగా హితవు చెప్పారు మధ్యవర్తులు.

భార్యాభర్తలన్నాక ఓ మాట అనుకోకుండా, ఓ దెబ్బ వేసుకోకుండా ఉంటారా అని మందలించారు. కలసి ఉండటానికి ప్రాతిపదికలు తయారుచేసే పనిలో పడ్డారు.

వేరే ఇల్లు కాకుండా తనవాళ్ళతో కలిసుంటే సంధ్య రావచ్చని నరేంద్ర పక్షం షరతు పెట్టారు.

వేరే ఇంట్లో కాదు - అసలు నరేంద్ర దగ్గరే అమ్మాయికి క్షేమం లేదు కాబట్టి, నరేంద్రే వాళ్ళింటికి రావాలని సంధ్య పక్షం వాళ్ళ షరతు.

సంధ్యకి ఇప్పుడు నాలుగో నెల కాబట్టి, ఆమె ఆరోగ్యం బాగుండాలంటే పుట్టింట్లోనే ఉండాలి. నరేంద్రే ఆమె దగ్గరకు వెళ్ళాలని వాళ్ళ షరతుకి బలం తెచ్చుకున్నారు. నరేంద్ర లొంగలేదు.

ఇల్లు ఖాళీ చేస్తున్నాను, సామాను తీసుకుపొమ్మన్నాడు.

ఎవరి సామాను వాళ్ళు తీసుకున్నారు.

నరేంద్రకు మళ్ళీ తన పాత జీవితం తనకు వచ్చినట్లనిపించింది.

చెల్లెళ్ళిద్దరి చదువులూ చూస్తున్నాడు. వాళ్ళ చేత మంచి పుస్తకాలు చదివిస్తున్నాడు.

తను వయొలిన్ నేర్చుకోటానికి సంగీతం మేష్టారి దగ్గర చేరాడు. శాంతమ్మ అప్పుడప్పుడూ కొడుకు కోల్పోయిన సుఖం గురించి కళ్ళనీళ్ళు పెట్టుకునేది.

"అమ్మా! నేనిప్పుడు హాయిగా ఉన్నాను. నువ్వూరికే గొడవ చెయ్యకు" అని ఆ ప్రస్తావన తుంచేసేవాడు.

ఐదు నెలలు గడిచిపోయాయి.

ఒకరోజు ఆఫీసుకు ఫోనొచ్చింది. - "సంధ్య ప్రసవించింది. కొడుకు పుట్టాడని."

ఏ హాస్పిటలో చెప్పలేదు. రమ్మని పిలవనూ లేదు.

నరేంద్రకు పెద్ద ఏడుపొకటి లోపల్నించి తన్నుకొచ్చింది. తనకు కొడుకు పుట్టాడు. తను తండ్రి అయ్యాడు. తనకు దుఃఖం వస్తోంది. ఆ పిల్లాడిని ఎలా పెంచుతారు. తనూ, సంధ్యా కలసి ఆ పిల్లాడిని పెంచటం సాధ్యమా? తమ గొడవల్లో వాడేమవుతాడు? బాత్‌రూం లోకి వెళ్ళి ఏడ్వగలిగినంత సేపు ఏడ్చి ముఖం కడుక్కుని వచ్చాడు.

వచ్చేసరికి తన సీటు ఎదురుగా సునంద. నరేంద్ర ముఖం సంతోషంతో వెలిగిపోయింది. శరీరమంతా కొత్త ఉత్సాహం నిండిపోయింది. ఈమధ్య కాలంలో నరేంద్ర శరీరానికీ, మనసుకీ ఇంత మంచి అనుభూతి ఎన్నడూ కలగలేదు.

సునంద మళ్ళీ హైదరాబాద్ రావాలనుకుంటోంది. ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ పెట్టి, దాన్ని ఫాలో అప్ చేయించే బాధ్యత నరేంద్రకు అప్పజెబుదామని వచ్చింది.

సునందను ఇంటికి రమ్మన్నాడుగానీ, ఆమె హోటల్లో దిగానంది. నరేంద్ర సెలవు పెట్టి సునందతో కలసి సెక్రటేరియట్‌కి వెళ్ళి ఆ పనులన్నీ ఉత్సాహంగా చూశాడు.

సాయంత్రానికి ఇద్దరూ సునంద దిగిన హోటల్‌కి చేరారు.

ముఖం కడుక్కుని వచ్చి కాఫీకి ఆర్డరిచ్చి అడిగింది సునంద.

"ఇప్పుడు చెప్పండి. ఎలా ఉంది మీ సంసారం?"

"సంసారమా? అదెక్కడుంది? వదిలేసి ఆరునెల్లయింది."

సునంద స్టన్ అయింది.

నరేంద్ర అంతా చెప్పుకొచ్చాడు.

"నాకు కొడుకు పుట్టాడు సునందా. నాకు ఏం చెయ్యాలో తెలియటం లేదు. నాకు సంతోషం లేదు. ఇక ఆ పసివాడి ద్వారా లొంగదీయాలని చూస్తారు. నాకు మళ్ళీ ఆమె ముఖం చూడాలని లేదు."

నరేంద్రకు మళ్ళీ దుఃఖం తన్నుకొచ్చింది. సునంద కీసారి నరేంద్ర మీద జాలేసింది. చేతులారా జీవితాన్ని పాడుచేసుకున్నాడు - అనిపించింది.

నరేంద్ర చేతిని పట్టుకుని -

"ఊరుకోండి. పరిస్థితిని బాగుచేసుకోవాలిగానీ, ఊరికే దుఃఖించి ఏం ప్రయోజనం?" అన్నది.

నరేంద్రకు సునంద చేతి స్పర్శ ఎంతో ఊరట ఇచ్చింది. చాలా ధైర్యం వచ్చినట్లయింది.

"సునందా - మీరు ఇక్కడికి వచ్చేస్తే నా ఒంటరితనం పోతుందేమో." ఆశగా అన్నాడు.

సునంద నవ్వి తన చేతిని విడిపించుకుంది.

అతనికి ఆమె దగ్గర్నించి కదలాలనిపించటం లేదు.

ఏడాది క్రితం కోల్పోయిన కాలం మళ్ళీ తిరిగొచ్చినట్లనిపించింది.

కబుర్లు దొర్లిపోతున్నాయి. నవ్వుతున్నాడు. నవ్విస్తున్నాడు. ఇద్దరూ కలసి భోజనం చేశారు. రాత్రి పదకొండు గంటలకు -

"ఇక మీరు వెళ్తే నేను నిద్రపోతాను. రాత్రి ప్రయాణంలో నిద్ర లేదు. విపరీతంగా నిద్ర వస్తోంది.

సునంద కుర్చీలోంచి లేచింది.

"నాకు వెళ్ళాలని లేదు. మీరు నిద్రపొండి. ఇక్కడే ఉంటాను" అన్నాడు.

నవ్వింది సునంద ఇబ్బందిగా.

"నిజంగా. నాకిక్కడి నుంచి వెళ్ళాలనిపించటం లేదు."

సునందకేం చెయ్యాలో పాలుపోలేదు. చివరికి -

"సరే - నేను పడుకుంటాను. మీరు వెళ్ళేటప్పుడు రూం లాక్ చేసి కింద ఇచ్చి వెళ్ళండి" అని వెళ్ళి పడుకుంది.

నరేంద్ర సునంద వంక చూస్తూ కూచున్నాడు. ఎంత నిశ్చింతగా నిద్రపోతోందో! ఒక మగాడు తన గదిలో ఉన్నాడన్న భయం లేకుండా, సంకోచం లేకుండా. తనమీది నమ్మకంతో, తనను మనిషిగా ఎంత గౌరవించిందీ ఇలా గదిలో ఉండనిచ్చి. ఆ నమ్మకాన్నీ గౌరవాన్నీ చేతులారా పాడుచేసుకున్నాడు. ఆమె చెప్పినట్లే విని ఉంటే - కానీ, అలా ఎలా కుదురుతుంది? ఇంటా బయటా అందరూ ఏమంటారు? ఇప్పుడేమయింది? ఏమంటున్నారు? ఇద్దరం చెరో చోట కాక కలసి ఉంటున్నామా? విపరీతమైన ద్వేషాలు మనసుల నిండా నింపుకుని, ఒక కప్పు కింద ఉండకపోతేనేం? ఆ కప్పుకి అంత విలువేమిటి? ఎలా వచ్చింది? ఏమిటీ జీవితానికి అర్థం? ఎంత భయంకరమైన ప్రయోగం చేశాడు తను జీవితంతోటి!

ఎంత అందమైన, మానవత్వ పూరితమైన కొత్త ప్రయోగం చెయ్యమని ఆహ్వానించింది సునంద! కనీసం ఆలోచించాడా తను? ఆ ఆలోచనకే వెగటు పడ్డాడు.

పిల్లలు పెద్ద బాధ్యత - కనాలో వద్దో జాగ్రత్తగా ఆలోచించాలని సునంద అంటే, వికృతంగా ఆలోచిస్తున్నదనుకున్నాడు.

ఇప్పుడు తను తండ్రి. సంధ్య పిల్లాణ్ణి కన్నది. ఎంత బాధ్యతా రహితంగా ప్రవర్తించాడో. పిల్లల్ని కనటం ఎంతగా ఆలోచించి తీసుకోవాల్సిన నిర్ణయమో ఇప్పుడు తెలుస్తోంది. ఇప్పుడు తను బందీ. ఈ చెర సామాన్యంగా వదలదు. భర్త, తండ్రి - ఈ బాధ్యతలతో తనిప్పుడేం చెయ్యగలడు? సునందలాంటి మనిషిని పోగొట్టుకున్నాడు.

రాత్రంతా అలా సునంద వంకే చూస్తూ గడిపేశాడు.

ఆరు గంటలకు కళ్ళు తెరిచిన సునంద అట్లాగే కూచుని ఉన్న నరేంద్రను చూసి విస్తుపోయింది. "రాత్రంతా అట్లా కూచుని ఉన్నారా?"

"ఆఁ - మిమ్మల్ని చూస్తూ వెళ్తాను, సాయంత్రం వస్తాను." లేచాడు నరేంద్ర.

"ఇవాళే నా ప్రయాణం. తొమ్మిది గంటల బస్‌కి టికెట్ కూడా ఉంది. పగలంతా నా ఫ్రెండ్స్‌తో గడిపి ఆరు గంటలకు ఇక్కడికి వస్తాను." చెప్పింది.

నరేంద్ర వెళ్ళిపోయాడు. ఇంటికెళ్ళేసరికి అందరూ కంగారుగా ఉన్నారు.

**ఏమిటీ జీవితానికి అర్థం? ఎంత భయంకరమైన ప్రయోగం చేశాడు తను జీవితం తోటి! కనీసం ఆలోచించాడా తను?**

"ఓ ఫ్రెండ్ దగ్గరకు వెళ్ళాలే" అని చెప్పాడు.

తనకు కొడుకు పుట్టాడనే వార్త ఇంట్లో ఎలా చెప్పాలో అర్థం కాలేదు.

స్నానం చేసి పడుకుని నిద్రపోయాడు. ఒంటి గంటకు తల్లి నిద్ర లేపింది.

"అన్నం తిని పడుకోరా. పొద్దున టిఫిన్ కూడా తినలేదు."

నరేంద్ర లేచి ముఖం కడుక్కుని డైనింగ్ టేబిల్ దగ్గర కొచ్చాడు.

అన్నం తింటుంటే తల్లి మెల్లిగా చెప్పింది:

"నీకు ఫోన్ చేశారా? నాన్నగారికి చేశారట." "ఊఁ -" అన్నాడు నరేంద్ర.

"మనవడు పుట్టాడన్న సంబరం లేదు. మన కర్మ ఇలా కాలిందేమిట్రా?"

"ఊరుకోమ్మా."

"నువ్వెళ్ళి చూసి రారాదూ! మన బిడ్డ - తప్పుతుందా?"

"ఎక్కడికి వెళ్ళాలి?"

"ఇంటికి వచ్చిందట. పురుడు తేలిగ్గా అయిందట. ఇవాళకి ఐదోరోజు. వెళ్ళి చూసిరా నాయనా. పగలు పెంచుకుంటే పసివాళ్ళు అన్యాయం అవుతారు."

నరేంద్ర భోజనం ముగించి పడుకున్నాడు.

శాంతమ్మకు మళ్ళీ చెప్పే ధైర్యం లేక ఊరుకుంది.

సాయంత్రం ఆరు గంటలకు సునంద దగ్గరకు వెళ్ళాడు. సునంద సామానంతా సర్దుకుని అతని కోసమే ఎదురుచూస్తూ కూచుంది.

"పగలంతా నిద్రపోయారా?" నరేంద్ర ముఖం పరిశీలనగా చూసింది.

ఔనన్నట్లు తలాడించాడు.

"ఇలా రోజూ రాత్రిళ్ళు నిద్ర మేల్కొంటున్నారా?"

"రోజూ మీరుండరుగా సునందా. నేనూ మీతో అనంతపురం వచ్చెయ్యనా?"

సునంద నరేంద్ర వంక జాలిగా చూసింది.

"ఇప్పుడెలా కుదురుతుంది నరేంద్రా?"

"ఎలాగైనా సరే - ఏమైనా సరే. నాకు రావాలని ఉంది."

"మనం ఎప్పుడే పని చెయ్యాలంటే అది చెయ్యగలిగేంత స్వేచ్ఛగా ఉన్నామనుకుంటున్నారా?"

"లేదు. నేను అసలు స్వేచ్ఛగా లేను. నాకు స్వేచ్ఛ కావాలి. అది మీ దగ్గర దొరుకుతుంది."

"ఒకరి స్వేచ్ఛ ఇంకొకరి దగ్గర దొరకదు."

"నేను విడాకులు తీసుకుంటాను. నేనా నరకం భరించలేను. నాకు మీరూ, మీ స్నేహం కావాలి."

నరేంద్ర పరిస్థితి చూస్తే సునందకు జాలిగానూ, నవ్వుగానూ కూడా ఉంది. చిన్నపిల్లాడి తత్త్వం ఇంకా పోలేదు అనుకుంది.

"అవన్నీ ఆలోచించవచ్చులే, ఇప్పటికిప్పుడు తేలేవి కావు" అంది.

నరేంద్ర ఆవేశంతో లేచి నిలబడ్డాడు.

"మీరు ఆలోచిస్తాననంటే చాలు. అదే నాకు కొండంత బలం. నాకు ఆకలేస్తోంది. ఏదైనా తినాలి. పదండి."

సునంద కూడా లేచి గది బయటకు నడిచింది. భోజనం చేస్తున్నంత సేపూ నరేంద్రను మాట్లాడనివ్వకుండా సునందే మాట్లాడింది.

పుస్తకాల గురించి, సినిమాల గురించి, అనంతపురం గురించి, అక్కడి స్నేహితుల గురించి, ఆ వాతావరణం గురించి ఆపకుండా మాట్లాడింది.

నరేంద్ర సర్వం మరిచిపోయి ఆమె మాటలు విన్నాడు.

రాత్రి తొమ్మిది గంటలకు అనంతపురం బస్సు సునందను తీసుకుపోతే, ఉసూరుమంటూ ఇల్లు చేరాడు.

* * *

వారం రోజుల తర్వాత సునంద ఉత్తరం బరువుగా అతని చేతుల్లోకి వచ్చినప్పుడు, దాన్ని విప్పటానికి భయం వేసింది నరేంద్రకు.

ఏముంటుందో ఈ ఉత్తరంలో. సునంద ఆలోచనలను తనెప్పుడూ ఊహించలేదు. తన బాధంతా సానుభూతితో విన్నట్లే విని, వేరే కోణంలోంచి ఆలోచిస్తుంది. తనకెన్నడూ కనపడని కోణాన్ని చూపిస్తుంది. ఇప్పుడూ అంతేనా?

ఆందోళనతో, కుతూహలంతో, ఉద్వేగంతో విప్పాడా ఉత్తరం. సునంద ప్రవర్తనలా అందంగా, స్వేచ్ఛగా, అదే సమయంలో ఒక క్రమంలో పరుచుకుని ఉన్నాయి - తెల్లని కాగితం మీద నీలిరంగు అక్షరాలు.

"నరేంద్రా!

ఎలా ఉన్నారు? మీరు శారీరకంగా, ఆరోగ్యంగా, మానసికంగా బలంగా ఉన్నప్పుడు మీకీ ఉత్తరం అందితే బాగుండు. ఈ ఉత్తరం రాసి మిమ్మల్ని నొప్పించాలని నా ఉద్దేశం ఎంతమాత్రమూ కాదు. నా అభిప్రాయాలు ఎప్పుడూ మీకు స్వేచ్ఛగా చెబుతూనే వచ్చాను. ఇప్పుడు కూడా ఏ సంకోచమూ లేకుండా నా ఆలోచనలు మీతో చెప్పాలనే ఈ ఉత్తరం రాస్తున్నాను. నా మాటల గురించి మీరెప్పుడూ సీరియస్‌గా ఆలోచించినట్లు నాకు అనిపించలేదు. ఇప్పుడూ అలాగే జరిగినా నేనాశ్చర్యపోను. మీరున్న పరిస్థితిలో మీరు మరింత కుంగిపోకుండా, మీ ఆలోచనలను పదునెక్కించి, మీకు కొత్త దృష్టిని ఏర్పరచగలగాలనే ఈ ఉత్తరం రాస్తున్నాను. మీరు ఎలా అర్థం చేసుకుంటారో?

మీరు మొన్న నాతో జీవితం పంచుకోవాలన్న కోరిక వ్యక్తం చేసినప్పుడు నాకు చాలా ఆశ్చర్యం వేసింది. మీరు - మీ ఒక్కరే కాదు - చాలా మంది మగవాళ్ళు నిజంగా పట్టి బలహీనులు. పిరికివాళ్ళు. మీ బలం సమాజం మీకిచ్చిన బలం తప్ప మీరు సాధించినది కానేకాదు. అంత పిరికివాళ్ళయి కూడా ఒక్కోసారి ఎంత దుస్సాహసమైనా చేయగలుగుతారు. బహుశా సమాజం వాళ్ళకిచ్చిన ప్రివిలేజెస్‌ని ఉపయోగించుకునే పద్ధతేమో అది.

నాతో జీవితం పంచుకోటానికి మీరు పడిన ఆందోళన నాకు తెలుసు. నాలాంటి అమ్మాయితో సుఖపడగలనా అని మీరు ఆలోచించటమూ నాకు తెలుసు. నా ధైర్యం, ఆత్మగౌరవం మిమ్మల్నెంత ఆకర్షిస్తున్నాయో, అంత భయపెడుతున్నాయనీ నాకు తెలుసు. కొంతకాలం ఆకర్షణ జయించినట్లు కనిపించినా, చివరికి భయమే జయించింది.

మీరు స్వర్ణ అనే అమ్మాయిని నూతన ఆర్థిక విధానం గురించి అడిగాననగానే నేను నవ్వి "ఐ హేట్ మెన్" అన్నాను - గుర్తుందా? ఎందుకో అప్పుడు చెప్పలేదు. ఇప్పుడు చెబుతాను. అవును - మగవాళ్ళకు ఎప్పటికప్పుడు తమకు అనువుగా ఉండే ఓ బొమ్మ కావాలి. తన ఆలోచనల్ని తన పలుకుల్ని యథాతథంగా పల్లెవేసే ఓ చిలక కావాలి. తన మానసికమైన, శారీరకమైన అవసరాలు మారిపోతున్నప్పుడల్లా ఒక కొత్త స్త్రీ కోసం వెదుకుతారు. తమతో పాటు ప్రయాణం చేయటానికి కొత్త బొమ్మ, కొత్త అలంకరణలు చేసుకున్న బొమ్మ, తమ కొత్త ఆలోచనలను ఆమోదించే బొమ్మ కోసం వెదుకుతారు. ఆ కొత్త బొమ్మ - ఆ కొత్త స్త్రీ మళ్ళీ తన వెనుకే ఉండాలి. తనను చూసి లేచి నిలబడాలి. సిగ్గుపడాలి.

కానీ, ఇవాళ జన్మిస్తున్న కొత్త స్త్రీ గురించి మీకేం తెలియదు. ఆమె మీ చిలక పలుకులు పలకదు. తన జీవిత సంగీతాన్ని తనే ట్యూన్ చేసుకుంటుంది.

ఆమెని చూసి భయపడతారు. అంత స్వేచ్ఛగా ఉన్న ఆమె మీ స్వేచ్ఛ నెక్కడ హరిస్తుందో అని భయపడతారు. స్వేచ్ఛ విలువ తెలియని మనుషుల దగ్గర స్వేచ్ఛగా మసలటం సాధ్యం కాదని మీకూ తెలియదు.

నరేంద్రా - మగవాళ్ళు వట్టి బానిసలు. తమ బానిసత్వం గురించి కనీస స్పృహ లేని పోరాటం చెయ్యాలనే జ్ఞానం కూడా లేని బానిసలు.

ఇవాళ స్త్రీలు తమ దుర్భర జీవితాలను మార్చుకోటానికి అద్భుతమైన పోరాటాలు చేస్తున్నారు. వాటి గురించి మీకేం తెలియదు.

మీకు కనక ఒక అణకువ గల భార్య దొరికి ఉంటే, మీకు కావలసిన మాటలన్నీ మాట్లాడి కూడా మీకూ మీ తలిదండ్రులకూ లొంగి ఉండే భార్య దొరికి ఉంటే మీకీ అశాంతి ఉండేది కాదు. చాలా సుఖంగా బతుకుతున్నాననుకునేవాళ్ళు. సుఖంగా ఉండేవాళ్ళు. కానీ, అప్పుడు కూడా జీవితం అశాంతిగానే ఉంటుందనీ, ఒకరు మనకి లొంగి ఉండే పరిస్థితే అశాంతికి మూలకారణమనీ తెలిసిన వ్యక్తి కోసం వెతుకుతున్నాను నేను.

నిర్భయంగా ప్రయోగాలు చేస్తూ, ఆ ప్రయోగాలలో కనుగొన్న సత్యాలతో జీవితాన్ని పరిపూర్ణం చేసుకుంటూ ముందుకు పోతున్న స్త్రీలు పందల్లోనైనా ఉన్నారు. ఆ కొత్త స్త్రీలను చూస్తే మీకు - ఈ సమాజానికి భయం.

వారు మీ సృష్టి కాదు. తమని తాము కొత్తగా సృష్టించుకుంటున్న కొత్త జీవం నింపుకుంటున్న ప్రాణులు వాళ్ళు. అందువల్ల వాళ్ళు మీకు అర్థం కారు. వాళ్ళతో సహజీవనం ఎంత అద్భుతమైన అనుభవమో మీకు తెలియదు.

మొన్న అడిగారే - నాతో కలసి బతుకుతానని. అది వట్టి మాట. ఒక నిస్సహాయ స్థితిలో వేసే కేక. నాలాంటి స్త్రీతో జీవితం పంచుకోగల వ్యక్తిత్వం మీకు లేదు. మీరు నాతో సమానంగా నడవలేరు. నేను ఆగాలి. ఆగకపోతే ఘర్షణ ఇంకో రూపంలో మొదలవుతుంది. నేను మీ భావాలు చూసి, మీ అభిరుచులు మంచివని తెలిసి, మీ మంచితనం చూసి మీరంటే ఇష్టపడ్డ మాట నిజం.

మీతో గడిపిన ఆ కొద్ది రోజుల అనుభవాన్ని గురించి నాకేం రిగ్రెట్స్ లేవు. కానీ, అతి త్వరలోనే తెలిసిపోయింది మీరు మామూలు మగవాళ్ళని.

మిగిలిన చాలామంది కంటే నిస్సందేహంగా మంచివారు. స్నేహపాత్రులు.

**చాలా మంది మగవాళ్ళు నిజంగా వట్టి బలహీనులు. పిరికివాళ్ళు.**
**మీ బలం సమాజం మీకిచ్చిన బలం తప్ప మీరు సాధించినది కానే కాదు.**

ఇవాళ సంధ్య ప్రవర్తన గురించి నీకు అభ్యంతరాలున్నాయి. కానీ, సంధ్యలు తయారవుతున్నారు. తయారవుతారు.

తనతో జీవితం పంచుకోటానికి సిద్ధపడే స్త్రీ తప్పనిసరిగా తనకంటే తక్కువ స్థాయిలో ఉండాలని కోరుకునే మగాళ్ళు తయారవుతున్న సమాజంలో-

భార్యను లొంగదీసుకుని, ఆమె శరీరాన్నీ ఆత్మనూ తన పరం చేసేసుకుని, ఆమె ఉనికినే హరించివేసే మగవాళ్ళు తయారవుతున్న సమాజంలో -

కుటుంబ జీవితంలో తమని తాము నిశ్శబ్దంగా ఆహుతి చేసుకోవటానికి తయారయ్యే స్త్రీలతో పాటు - ఆ కుటుంబ జీవితంలోనే ఆధిపత్యం కోసం, మొరటుగా ఈ సమాజం సృష్టించిన వికృత విలువల్నే ఆయుధాలుగా చేసుకుని పోట్లాడటానికి సంధ్య లాంటి స్త్రీలు వేలల్లోనయినా తయారవుతారు.

అది సహజం. అనివార్యం.

వాళ్ళతో పాటు స్వేచ్ఛ కోసం యుద్ధం చేస్తూ, కొత్త విలువల కోసం, కొత్త మానవ సంబంధాల కోసం, స్నేహం ప్రేమల కోసం తమ జీవితాలతో అంతకు మించి మీ గురించి ఆలోచించలేను. మీరు, మీలాంటి చాలామంది మగవాళ్ళు సమాజానికి లొంగిపోయి బతుకుతారు. మీకు మీ జీవితాలకంటే సమాజం, మీ జీవితాల గురించి చేసే వ్యాఖ్యలు ముఖ్యం. వాటి కోసమే బతుకుతారు.

ఎనిమిదో క్లాసు పిల్లలు వంద సంవత్సరాల క్రితం రుజువైన ప్రయోగాన్ని మళ్ళీ వాళ్ళ స్కూల్లోని అతి ఇరుకు లాబరేటరీలో చేసి నేర్చుకుంటారే - అంతకు మించి ఎదగలేదు మీరు.

రొటీన్ బురద లోంచి పైకి లేవడం కూడా భయం మీకు. ఆ బురద ఊబైతే - అది మీకు మునిగిపోక ముందే తెలిస్తే, అప్పుడు వేస్తారు చావుకేకలు. కానీ, అప్పుడు అందులోంచి బయటపడటం అసాధ్యం.

తమ మురికినీ, బురదనూ స్వచ్ఛమైన భావాలతో కడుక్కుని, కొత్త వెలుగులో, కాంతిలో విలువైన తమ జీవితాలతో ప్రపంచంలో తేగలిగిన మార్పు కోసం ప్రయోగాలకు సిద్ధంగా ఉన్న మనిషి కోసం నేను నిరీక్షిస్తున్నాను.

— సునంద ■


# చందాదారునికి చక్కని అవకాశం

## 1994 ఫిబ్రవరి 28 వరకు ప్రత్యేక అవకాశం

ఫిబ్రవరి 28 లోగా ఇండియా టుడేకి చందా చెల్లించి, చక్కని విలువను పొందండి.

- అద్భుతమైన ఆదా సౌకర్యాన్ని అందుకోండి.
- ఉచితంగా, సొగసైన ఇండియా టుడే పాకెట్ డైరీ 1994ని అందుకోండి.

మీ చెల్లింపును INDIA TODAY (Telugu), P.O. Box 256, New Delhi - 110 001కి పంపించండి.

**31% వరకు ఆదా చేయండి**

| చందా కాలం | 1 సంవత్సరం | 2 సంవత్సరాలు | 3 సంవత్సరాలు |
|---|---|---|---|
| మీరు చెల్లించేది | రూ. 154 | రూ. 288 | రూ. 396 |
| మీకు ఆదా | రూ. 38 (20%) | రూ. 96 (25%) | రూ. 180 (31%) |
| సంచిక వెల | రూ. 6.40 | రూ. 6.00 | రూ. 5.50 |

* సాధారణ ప్రతి వెల రూ. 8.00

**ఈరోజే మీ ఆర్డర్ పంపించండి**

**ఇండియా టుడే**